PRGI No : TGMUL/25/A1386

# తొలి అక్షరం

మా అక్షరమే - మీ అయుధంగా...

చీఫ్ ఎడిటర్ పస్తం సైదులు

www.tholiaksharam.com

చీఫ్ ఎడిటర్ : పస్తం సైదులు, సంపుటి : 03 సంచిక - 326 పేజీలు - 08 మంగళవారం 20 అక్టోబర్ 2026

## తొలి అక్షరం పాఠకులకు విజయదశమి శుభాకాంక్షలు

**- అక్షర ఖడ్గాన్ని చేతపట్టు.. అజ్ఞాన మహిషాసురుడిని నరికిపట్టు!**

**- తొలి అక్షరం దినపత్రిక ఎడిటర్ పస్తం సైదులు**



**తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి (పి. సైదులు), అక్టోబర్ 19:** అన్యాయంపై న్యాయం, అసత్యంపై సత్యం సాధించిన విజయానికి ప్రతీక విజయదశమి అని తొలి అక్షరం దినపత్రిక ఎడిటర్ పస్తం సైదులు పేర్కొన్నారు. దసరా స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ భయాన్ని వీడి, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఆకలి, అన్యాయం, అవినీతిపై అక్షరమే ఆయుధంగా ప్రజల పక్షాన తమ పత్రిక నిరంతరం పోరాడుతుందని తెలిపారు. దుర్గాదేవి ఆశీస్సులతో ప్రజల జీవితాల్లో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, విజయాలు నిండాలని ఆకాంక్షిస్తూ పాఠకులందరికీ విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. - విజయం మనదే.. ప్రగతి మనదే!



పాఠకులకు ప్రకటనకర్తలు శ్రేయోభిలాషులకు

విజయ దశమి శుభాకాంక్షలు

నేడు దసరా పర్వదినం సందర్భంగా పత్రికా కార్యాలయానికి సెలవు. కావున రేపు (21 అక్టోబర్ బుధవారం ) సంచిక వెలువడదు .. (పునర్దర్శనం గురువారం )

## పారిశ్రామికాభివృద్ధికి శాంతిభద్రతలే కీలకం!

**● ప్రపంచ పెట్టుబడులకు తెలంగాణ గమ్యస్థానం కావాలి ● ఫ్యూచర్ సిటీలో పోలీస్ కమిషనరేట్ ప్రారంభం ● రూ.200 కోట్లతో ఎన్ఐయూఎం నూతన ప్రాంగణం ● డిసెంబర్ 7 నుంచి 9 వరకు ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్**



**తొలి అక్షరం/హైదరాబాద్,అక్టోబర్ 19:** రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధికి శాంతిభద్రతల పరిరక్షణే ప్రధానమని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వ విధానాల్లో చిత్తశుద్ధి, ఆధునిక పోలీసు వ్యవస్థ సమర్థంగా పనిచేస్తేనే ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడులను ఆకర్షించగలమని తెలిపారు. భారత్ ఫ్యూచర్ సిటీని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం పక్కా ప్రణాళికతో పనిచేస్తోందని పేర్కొన్నారు.సోమవారం భారత్ ఫ్యూచర్ సిటీలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న ముఖ్యమంత్రి, ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్ ప్రధాన కార్యాలయ భవన సముదాయాన్ని ప్రారంభించారు. అనంతరం నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అర్బన్ మేనేజ్‌మెంట్ (ఎన్ఐయూఎం) నూతన ప్రాంగణ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ప్రజల భద్రత, నేరాల నియంత్రణ, వేగవంతమైన పోలీసు సేవలు అందించడమే కమిషనరేట్ ప్రధాన లక్ష్యమని వివరించారు. **ఆధునిక సాంకేతికతతో పోలీసు సేవలు**కృత్రిమ మేధ, సైబర్ నేరాల దర్యాప్తు, డిజిటల్ ఆధారాల విశ్లేషణ, మహిళల భద్రత వంటి అంశాలపై మిగతా2లో...



## ఎల్‌నినోపై అప్రమత్తంగా ఉండాలి!

**● తాగునీరు, విద్యుత్ కొరత రాకుండా ముందస్తు ప్రణాళికలు ● అక్రమ నీటి మోటార్ల తొలగింపు.. తాగునీటి అవసరాలకే బోరుబావుల అనుమతులు**

**తొలి అక్షరం/హైదరాబాద్,అక్టోబర్ 19:** ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో తాగునీరు, విద్యుత్ కొరత ఏర్పడకుండా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. జిల్లాలతో పాటు మండల స్థాయిలోనూ ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఎల్‌నినో ప్రభావంపై సోమవారం సీనియర్

మిగతా2లో...

## ఎల్‌నినో పరిస్థితులపై అధ్యయనానికి కేబినెట్ ఉపసంఘం

**- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధ్యక్షతన కమిటీ ఏర్పాటు**



2లో

## భూ వివాదాల శాశ్వత పరిష్కారమే లక్ష్యం

**- రైతుల హక్కుల పరిరక్షణకు భూభారతి.. అధికారులకు మంత్రి పొంగులేటి ఆదేశాలు**



**తొలి అక్షరం/హైదరాబాద్,అక్టోబర్ 19:** రాష్ట్రంలో భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపడమే ప్రభుత్వ లక్ష్యమని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. భూభారతి, రెవెన్యూ శాఖ అధికారులతో సోమవారం సచివాలయంలో ఆయన సమీక్ష నిర్వహించారు. రైతుల భూమి హక్కులకు భద్రత కల్పించడంతోపాటు రెవెన్యూ సేవల్లో పారదర్శకత పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. భూభారతి చట్టం అమల్లోకి వచ్చినప్పటి నుంచి పట్టాదారు పాస్‌పుస్తకాల జారీ, భూముల పునఃసర్వే, పెండింగ్ భూ సమస్యల పరిష్కారంపై మంత్రి సమీక్షించారు. అర్హులైన రైతులకు భూమి హక్కు పత్రాలు అందేలా మిగతా2లో...

## యెమెన్‌లో హౌతీల క్షిపణి దాడి.. 53 మంది మృతి!

**● సైనిక శిక్షణ శిబిరంపై మూడు బాలిస్టిక్ క్షిపణులతో విరుచుకుపాటు ● 200 మందికి పైగా గాయాలు**



**తొలి అక్షరం/షబ్వా,అక్టోబర్ 19:** యెమెన్‌లో మరోసారి హింస చెలరేగింది. ప్రభుత్వ భద్రతా దళాల శిక్షణ శిబిరంపై హౌతీ తిరుగుబాటుదారులు బాలిస్టిక్ క్షిపణులతో దాడి చేశారు. ఈ ఘటనలో కనీసం 53 మంది మృతి చెందగా, మరో 200 మందికి పైగా గాయపడ్డారు. దక్షిణ యెమెన్‌లోని షబ్వా ప్రావిన్స్‌లో సోమవారం ఈ దాడి జరిగినట్లు స్థానిక అధికారులు వెల్లడించారు.సైనిక శిక్షణ జరుగుతున్న సమయంలో మూడు క్షిపణులు శిబిరాన్ని తాకినట్లు సమాచారం. గాయపడిన వారిని సమీప ఆసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. హౌతీ ప్రతినిధులు దాడికి బాధ్యత ప్రకటిస్తూ, ఆ శిబిరంలో సౌదీ అధికారుల ఆధ్వర్యంలోని బలగాలు ఉన్నాయని పేర్కొన్నారు. అయితే, దీనికి సంబంధించి వారు ఆధారాలు వెల్లడించలేదు. మిగతా2లో...



## అధర్మంపై ధర్మం సాధించిన విజయానికి ప్రతీక దసరా

**- ప్రజలందరికీ విజయదశమి శుభాకాంక్షలు తెలిపిన సీఎం రేవంత్‌రెడ్డి**

**తొలి అక్షరం/హైదరాబాద్,అక్టోబర్ 19:** అధర్మంపై ధర్మం, చెడుపై మంచి సాధించిన విజయానికి విజయదశమి ప్రతీకగా నిలుస్తుందని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ ప్రజలందరికీ విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర సంస్కృతి, మిగతా2లో...

## ఉక్రెయిన్‌తో ఘర్షణకు చెక్!

**- ట్రంప్, జిన్‌పింగ్‌లతో త్రైపాక్షిక భేటీకి పుతిన్ ప్రతిపాదన**

**- నవంబర్‌లో శిఖరాగ్ర సమావేశానికి యత్నాలు**



2లో

## కనకదుర్గమ్మ ఆశీస్సులతో రాష్ట్రం అభివృద్ధి చెందాలి

**- ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు తెలిపిన సీఎం చంద్రబాబు**



2లో

## కేసీఆర్ ఫామ్‌హౌస్ వివాదం..

**ముగ్గురు కాంగ్రెస్ నేతలకు బీఆర్ఎస్ నోటీసులు!**

**కొండపోచమ్మ సాగర్ నీటి మళ్లింపుపై ఆరోపణలు**

**సామాజిక మాధ్యమాల్లో పోస్టులు తొలగించాలని డిమాండ్**



2లో





2లో

## సింగరేణి అధికారులకు వేతనాల పెంపు.. దసరా కానుక!

**- 1,800 మంది అధికారులకు ప్రయోజనం.. అక్టోబర్ జీతాల నుంచే అమలు**

# ఉక్రెయిన్‌తో ఘర్షణకు చెక్!

**తొలి అక్షరం/మాస్కో,అక్టోబర్ 19:** రష్యా-ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు పలికే దిశగా కీలక పరిణామం చోటుచేసుకున్నట్లు అంతర్జాతీయ కథనాలు వెల్లడించాయి. ఉక్రెయిన్‌తో వివాదంపై చర్చించి, రష్యాకు అనుకూలమైన శాంతి ఒప్పందం కుదుర్చుకునే లక్ష్యంతో వచ్చే నెలలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌లతో త్రైపాక్షిక సమావేశం నిర్వహించాలని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ప్రతిపాదించినట్లు సమాచారం. అక్టోబర్ 9న ట్రంప్‌తో జరిగిన ఫోన్ సంభాషణలో పుతిన్ ఈ ఆలోచనను ప్రస్తావించినట్లు నివేదిక పేర్కొంది. నవంబర్ 18, 19 తేదీల్లో చైనాలోని షెన్‌జెన్‌లో జరగనున్న ఆసియా-పసిఫిక్ ఆర్థిక సహకార సదస్సు సందర్భంగా ఈ చర్చలు నిర్వహించే అవకాశాన్ని రష్యా పరిశీలిస్తున్నట్లు తెలిపింది.

అయితే, ఈ సమావేశానికి ట్రంప్ ఇంకా అధికారికంగా అంగీకరించలేదు. చైనా కూడా ట్రంప్ పాల్గొంటే అభ్యంతరం ఉండబోదని సంకేతాలు ఇచ్చినట్లు సమాచారం. ఈ ప్రతిపాదనపై ఉక్రెయిన్, అమెరికా-యూరోపియన్ దేశాల మిత్రపక్షాల్లో ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా శాంతి చర్చల్లో ఉక్రెయిన్‌కు ప్రాతినిధ్యం లేకపోవడం చర్చనీయాంశంగా మారింది. మరోవైపు, రష్యా-ఉక్రెయిన్ యుద్ధాన్ని ముగించేందుకు జరుగుతున్న చర్చల్లో గణనీయమైన పురోగతి సాధిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆశాభావం వ్యక్తం చేశారు.

అయితే, త్రైపాక్షిక సమావేశం ఖరారైందా, దాని ద్వారా ఒప్పందం కుదురుతుందా అనే అంశాలపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది.

# కేసీఆర్ ఫామ్‌హౌస్ వివాదం..

**తొలి అక్షరం/హైదరాబాద్, 19:** బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ఫామ్‌హౌస్‌కు కొండపోచమ్మ సాగర్ నీటిని మళ్లించారంటూ వస్తున్న ఆరోపణలపై రాజకీయ వివాదం ముదురుతోంది. ఈ వ్యవహారంలో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణలకు బీఆర్ఎస్ న్యాయ విభాగం నోటీసులు జారీ చేసింది. బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి, న్యాయ విభాగం ఇన్‌ఛార్జి సోమ భరత్ కుమార్ ఈ నోటీసులు పంపించినట్లు సమాచారం. కేసీఆర్ ప్రతిష్ఠను దెబ్బతీసేలా నిరాధార ఆరోపణలు చేస్తున్నారని బీఆర్ఎస్ అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ అంశంపై ఇప్పటికే ఓ తెలుగు దినపత్రిక యాజమాన్యానికి, సంపాదకుడికి నోటీసులు పంపించినట్లు పార్టీ వెల్లడించింది. సంబంధిత ఆరోపణలతో తమ సామాజిక మాధ్యమ ఖాతాల్లో చేసిన పోస్టులను వెంటనే, బేషరతుగా తొలగించాలని, ఆరోపణలను ఉపసంహరించుకోవాలని ముగ్గురు కాంగ్రెస్ నేతలను బీఆర్ఎస్ న్యాయ విభాగం కోరింది. సాగునీటి ప్రాజెక్టులపై ఆధారాలు లేని ఆరోపణలతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలను సహించబోమని హెచ్చరించింది. నోటీసులకు స్పందించకపోతే పరువునష్టం సహా వర్తించే చట్టాల ప్రకారం తదుపరి న్యాయపరమైన చర్యలు చేపడతామని స్పష్టం చేసింది. కాంగ్రెస్ నేతల స్పందన, ఆరోపణలకు సంబంధించిన వాస్తవాలు తదుపరి పరిణామాల్లో కీలకం కానున్నాయి.

# పారిశ్రామికాభివృద్ధికి శాంతిభద్రతలే కీలకం!

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణ పోలీసులు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారని సీఎం తెలిపారు. ఇప్పటికే 210 మందికి పైగా పోలీసు అధికారులు, సిబ్బంది కృత్రిమ మేధ వినియోగంపై ప్రత్యేక శిక్షణ పూర్తి చేశారని వెల్లడించారు. ఫ్యూచర్ సిటీ విస్తరణకు అనుగుణంగా పోలీసు జోన్లు, డివిజన్లు, మహిళా పోలీస్ స్టేషన్లు, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

**రూ.200 కోట్లతో ఎన్ఐయూఎం ప్రాంగణం** భారత్ ఫ్యూచర్ సిటీలో 20 ఎకరాల స్థలంలో సుమారు రూ.200 కోట్ల అంచనా వ్యయంతో ఎన్ఐయూఎం నూతన ప్రాంగణాన్ని నిర్మించనున్నట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు. 2028 జూన్ 2 నాటికి నిర్మాణాన్ని పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. పర్యావరణహితంగా, నెట్‌జీరో లక్ష్యంతో ఈ ప్రాంగణాన్ని రూపొందించనున్నారు. భవనాలపై సౌర విద్యుత్ వ్యవస్థలు, సౌరశక్తితో నీటిని వేడి చేసే సదుపాయాలు, ఎల్ఈడీ దీపాలను ఏర్పాటు చేయనున్నారు.

**పట్టణ పాలనపై పరిశోధనలు.. అధికారులకు శిక్షణ** ఈ ప్రాంగణంలో పట్టణ పాలన, ఆర్థిక వనరుల సమీకరణ, మౌలిక సదుపాయాలు, పట్టణ రవాణా, సామాజిక-ఆర్థిక అభివృద్ధి, వాతావరణ మార్పుల ప్రభావాల తగ్గింపు తదితర అంశాలపై పరిశోధనలు చేపట్టనున్నారు. కొత్త ఆలోచనలను ప్రోత్సహించేందుకు ప్రత్యేక కేంద్రాన్ని, మున్సిపల్ కమిషనర్లు, అధికారులు, ప్రజాప్రతినిధులకు శిక్షణ ఇచ్చేందుకు సామర్థ్యాభివృద్ధి కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నారు. శిక్షణార్థులు, పరిశోధకులు, నిపుణుల కోసం 122 నివాస గదులను నిర్మించనున్నారు. ఎన్ఐయూఎం ఇప్పటివరకు 6,000 మందికి పైగా ప్రజాప్రతినిధులు, అధికారులకు శిక్షణ అందించిందని సీఎం తెలిపారు. పట్టణాల అభివృద్ధి, ప్రణాళికల రూపకల్పన, ఘన వ్యర్థాల నిర్వహణ వంటి రంగాల్లో ఈ సంస్థ కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు.

**గ్లోబల్ సమ్మిట్‌కు విస్తృత ఏర్పాట్లు** డిసెంబర్ 7 నుంచి 9 వరకు భారత్ ఫ్యూచర్ సిటీలో నిర్వహించనున్న 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్2026' ఏర్పాట్లను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. దేశ, విదేశాల నుంచి పారిశ్రామికవేత్తలు హాజరయ్యేలా అంతర్జాతీయ స్థాయి ఏర్పాట్లు చేయాలని సూచించారు. యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ నిర్మాణ పనులను పరిశీలించిన ఆయన, నిర్దేశిత గడువుకు ముందే పనులు పూర్తి చేయాలని, నవంబర్ నెలాఖరులోగా సమ్మిట్ ఏర్పాట్లు సిద్ధం చేయాలని ఆదేశించారు. తెలంగాణలో పెట్టుబడులకు అనుకూల వాతావరణం కల్పించడం, పారిశ్రామికాభివృద్ధికి భరోసా ఇవ్వడం, ఆధునిక పోలీసు వ్యవస్థను బలోపేతం చేయడం ద్వారా రాష్ట్రాన్ని ప్రపంచ పెట్టుబడులకు ఆకర్షణీయ కేంద్రంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని సీఎం వివరించారు. ఈ కార్యక్రమాల్లో పోలీసు ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఎల్‌నినోపై అప్రమత్తంగా ఉండాలి!

(మొదటి పేజీ తరువాయి)

ఐఏఎస్ అధికారులతో నిర్వహించిన వీడియో సమావేశంలో పరిస్థితులను సమీక్షించారు. రాష్ట్రంలో వ్యవసాయ, గృహ అవసరాలకు విద్యుత్ సరఫరా కొనసాగుతోందని, పరిశ్రమలకు విద్యుత్ కోతలు విధించడం లేదని తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాల్లో విద్యుత్‌ను పొదుపుగా వినియోగించాలని ఆదేశించారు. అన్ని థర్మల్ విద్యుత్ కేంద్రాల్లో ఉత్పత్తిని గరిష్ఠ స్థాయికి పెంచేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. యాదాద్రి థర్మల్ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తిపై ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు.

**అక్రమ నీటి మోటార్లపై ప్రత్యేక నిఘా** స్థానిక నీటి వనరుల నుంచి అక్రమంగా మోటార్లతో నీటిని తోడటం వల్ల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లపై అధిక భారం పడుతోందని అధికారులు వివరించారు. హైదరాబాద్‌లో నల్లాలకు అక్రమంగా మోటార్లు బిగించి నీటిని తోడే వారిపై ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. హైడ్రా తదితర సంస్థల సహకారంతో అక్రమ మోటార్లను తొలగిస్తున్నట్లు వెల్లడించారు.

**తాగునీటి అవసరాలకే బోరుబావుల తవ్వకాలు** హైదరాబాద్‌లో నిబంధనల ప్రకారం తాగునీటి అవసరాలకే కొత్త బోరుబావుల తవ్వకాలకు అనుమతించాలని అధికారులు స్పష్టం చేశారు. నిర్మాణ పనుల కోసం కొత్త బోర్లు వేయడానికి అనుమతులు ఇవ్వవద్దని సూచించారు. ఇప్పటికే ఉన్న బోరుబావులను తాగునీటి అవసరాల కోసం మరింత లోతుగా తవ్వేందుకు నిబంధనల మేరకు అనుమతిస్తామని తెలిపారు. నవంబర్ 1 నుంచి నిర్మాణ పనులకు శుద్ధి చేసిన మురుగునీటిని ప్రత్యేక ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయనున్నట్లు వెల్లడించారు. రంగారెడ్డి జిల్లాలో భూగర్భ జలాల మట్టం తగ్గుతున్న నేపథ్యంలో తాగునీటి సమస్య తలెత్తకుండా ప్రత్యామ్నాయ చర్యలు చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు. ఇతర జిల్లాల్లోనూ తాగునీరు, పశుగ్రాసం కొరత రాకుండా ముందస్తు ప్రణాళికలు అమలు చేస్తున్నట్లు వివరించారు. ఎల్‌నినో ప్రభావంపై త్వరలో అఖిలపక్ష సమావేశం నిర్వహించడంతో పాటు మంత్రివర్గ ఉపసంఘం సమావేశం కూడా ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు వెల్లడించారు.

# ప్రాణహిత జలాల కోసం కవిత పోరుబాట!

## నవంబర్ నెలాఖరులోగా కాఫర్ డ్యాం పనులు ప్రారంభించాలి

## కన్నెపల్లి పంప్‌హౌస్ వద్ద కవిత డిమాండ్



**తొలి అక్షరం/కన్నెపల్లి,అక్టోబర్ 19:** రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన కన్నెపల్లి పంప్‌హౌస్ వద్ద కాఫర్ డ్యాం నిర్మాణ పనులను నవంబర్ నెలాఖరులోగా ప్రారంభించాలని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రాణహిత నది నీటిని రైతులకు ఉపయోగపడేలా మళ్లించేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. కన్నెపల్లి పంప్‌హౌస్‌ను సందర్శించిన కవిత, అందుబాటులో ఉన్న గోదావరి జలాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మేడిగడ్డ బ్యారేజీ సమస్యను సాకుగా చూపకుండా రైతులకు సాగునీరు అందించే ప్రత్యామ్నాయ మార్గాలను పరిశీలించాలని అన్నారు. సుమారు రూ.25 కోట్లతో నెలన్నర రోజుల్లో కాఫర్ డ్యాం పనులు పూర్తి చేయవచ్చని పేర్కొన్నారు. ప్రభుత్వం నవంబర్ నెలాఖరులోగా పనులు ప్రారంభించకపోతే కన్నెపల్లి పంప్‌హౌస్ వద్ద ఆందోళన చేపడతామని కవిత హెచ్చరించారు. రైతుల సమస్యలను రాజకీయాలకు అతీతంగా పరిష్కరించి, సాగునీటి కొరత నివారణకు చర్యలు తీసుకోవాలని కోరారు.

# యెమెన్‌లో హౌతీల క్షిపణి దాడి.. 53 మంది మృతి!

(మొదటి పేజీ తరువాయి)

యెమెన్‌లో ప్రభుత్వ బలగాలు, హౌతీ తిరుగుబాటుదారుల మధ్య ఇటీవలి కాలంలో ఘర్షణలు తీవ్రతరమయ్యాయి. గతంలో కొనసాగిన కాల్పుల విరమణ ఒప్పందం విచ్ఛిన్నం కావడంతో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. తాజా దాడితో ప్రాంతంలో భద్రతాపరమైన ఆందోళనలు పెరిగాయి.

# అధర్మంపై ధర్మం సాధించిన విజయానికి ప్రతీక దసరా

(మొదటి పేజీ తరువాయి)

సంప్రదాయాల్లో దసరా పండుగకు ప్రత్యేక స్థానం ఉందని అన్నారు. దసరా పండుగ ధైర్యం, ధర్మం, సత్యం, ఐక్యత, ఆత్మవిశ్వాసం వంటి విలువలను నేర్పుతుందని సీఎం పేర్కొన్నారు. అహంకారం, అసూయ, ద్వేషం, అన్యాయం వంటి ప్రతికూల భావాలను విడిచిపెట్టి ప్రేమ, కరుణ, సోదరభావం, మానవత్వంతో కూడిన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. మహిషాసురుడిపై దుర్గాదేవి సాధించిన విజయం, రావణుడిపై శ్రీరాముడి గెలుపు ధర్మానికి ఉన్న శక్తిని చాటిచెబుతాయని తెలిపారు. తెలంగాణలో జమ్మిచెట్టును పూజించడం, జమ్మి ఆకులను బంగారంగా భావించి పెద్దలకు అందించి ఆశీర్వాదాలు తీసుకోవడం వంటి సంప్రదాయాలు ప్రకృతిని గౌరవించడం, పెద్దలను ఆదరించడం నేర్పుతాయని పేర్కొన్నారు. ఈ విజయదశమి ప్రతి ఇంటా ఆనందం, సంతోషం, ఐశ్వర్యం నింపాలని, ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, అభివృద్ధి, విజయాలు కలగాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు.

# కనకదుర్గమ్మ ఆశీస్సులతో రాష్ట్రం అభివృద్ధి చెందాలి

## - ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు తెలిపిన సీఎం చంద్రబాబు

**తొలి అక్షరం/అమరావతి,అక్టోబర్19:** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్ర ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా నిలిచే దసరా పండుగ ప్రజలందరికీ గొప్ప స్ఫూర్తినిస్తుందని పేర్కొన్నారు. సోమవారం తన సామాజిక మాధ్యమ ఖాతా ద్వారా పండుగ సందేశాన్ని అందించారు. రైతుల శ్రమకు తగిన ఫలితం అందించడం, మహిళలకు సాధికారత కల్పించడం, యువతకు ఉజ్వల భవిష్యత్తును అందించేందుకు ప్రభుత్వం చేస్తున్న కృషికి జగన్మాత ఆశీస్సులు లభించాలని ఆకాంక్షించారు. విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువైన కనకదుర్గమ్మ దీవెనలతో ఆంధ్రప్రదేశ్ అన్ని రంగాల్లో విజయాలు సాధిస్తూ అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని కోరుకున్నారు. రాష్ట్రంలోని ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, శాంతి సౌభాగ్యాలతో వర్ధిల్లాలని ముఖ్యమంత్రి మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు. ప్రజలందరికీ మరోసారి విజయదశమి శుభాకాంక్షలు తెలియజేశారు.

# ఎల్‌నినో పరిస్థితులపై అధ్యయనానికి కేబినెట్ ఉపసంఘం

**తొలి అక్షరం/హైదరాబాద్:అక్టోబర్ 19:** రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావంతో నెలకొన్న వర్షాభావ పరిస్థితులను సమీక్షించి, వాటిని ఎదుర్కొనేందుకు అవసరమైన చర్యలను సూచించేందుకు తెలంగాణ ప్రభుత్వం కేబినెట్ ఉపసంఘాన్ని ఏర్పాటు చేసింది. ఈ కమిటీకి ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధ్యక్షత వహించనున్నారు. సభ్యులుగా మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, దాసరి అనసూయ (సీతక్క), వాకిటి శ్రీహరి వ్యవహరించనున్నారు. ఎల్‌నినో పరిస్థితులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, తాగునీటి కొరత, వ్యవసాయం, విద్యుత్ సరఫరాపై ప్రభావాన్ని అంచనా వేయడం, ముందస్తు చర్యలపై ప్రభుత్వానికి సిఫారసులు చేయడం ఈ కమిటీ ప్రధాన బాధ్యత. రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొని ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవడంపై ప్రభుత్వం దృష్టి సారించింది. ఈ మేరకు సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది.

# సింగరేణి అధికారులకు వేతనాల పెంపు.. దసరా కానుక!




**తొలి అక్షరం/హైదరాబాద్,అక్టోబర్ 19:** సింగరేణి అధికారులకు ప్రభుత్వం దసరా కానుక అందించింది. కోల్‌ఇండియా తరహాలో ఎగ్జిక్యూటివ్ క్యాడర్ ఈ-1 నుంచి ఈ-7 వరకు పనిచేస్తున్న సుమారు 1,800 మంది అధికారులకు వేతన సవరణ చేస్తూ సింగరేణి యాజమాన్యం ఉత్తర్వులు జారీ చేసింది. సింగరేణి పర్సనల్ డైరెక్టర్ గౌతమ్ పోట్రు సోమవారం ఈ ఉత్తర్వులు విడుదల చేశా రు. సవరించిన ప్రాథమిక వేతనాలు 2017 జనవరి 1 నుంచి అమల్లోకి వచ్చినట్లు పరిగణిం చనుండగా, ఆర్థిక ప్రయోజనాలు 2026 సెప్టెంబర్ 25 నుంచి వర్తించనున్నాయి. పెరిగిన వేతనా లను అక్టోబర్ నెల జీతాల నుంచే చెల్లించనున్నారు. కొత్త వేతన స్కేల్ ప్రకారం ఈ-1 క్యాడర్ ప్రాథ మిక వేతనం రూ.40 వేల నుంచి రూ.60 వేలకు, ఈ-2 క్యాడర్ రూ.50 వేల నుంచి రూ.70 వేలకు, ఈ-3 క్యాడర్ రూ.60 వేల నుంచి రూ.80 వేలకు, ఈ-4 క్యాడర్ రూ.70 వేల నుంచి రూ.90 వేలకు, ఈ-5 క్యాడర్ రూ.80 వేల నుంచి రూ.లక్షకు, ఈ-6 క్యాడర్ రూ.90 వేల నుంచి రూ.1.20 లక్షలకు పెరగనుంది. ఈ నిర్ణయంతో సింగరేణి అధికారులకు ఆర్థికంగా ప్రయోజనం చేకూరనుంది.

# భూ వివాదాల శాశ్వత పరిష్కారమే లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

క్షేత్రస్థాయిలో పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. భూముల వివరాల్లో ఉన్న లోపాలను సరిచేసి, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. భూముల పునఃసర్వే ద్వారా దీర్ఘకాలంగా పరిష్కారం కాని సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని మంత్రి తెలిపారు. మహబూబాబాద్ జిల్లా నారాయణపురం గ్రామంలో 906 మంది రైతులకు 1,600 ఎకరాలకు పైగా భూమిపై హక్కులు కల్పించినట్లు వివరించారు. సూర్యాపేట జిల్లాలోని నూతనకల్, మద్దిరాల మండలాల పరిధిలో 15 గ్రామాలకు చెందిన 2,400 మంది రైతులకు 3,450 ఎకరాలకు సంబంధించి భూమి హక్కు పత్రాలు అందించినట్లు తెలిపారు. రైతులకు బ్యాంకు రుణాలు, రైతు భరోసా వంటి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా భూమి రికార్డులను క్రమబద్ధీకరించాలని అధికారులకు సూచించారు. భూ సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం చేయకుండా, అర్హులైన ప్రతి రైతుకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని మంత్రి పొంగులేటి ఆదేశించారు.

# కుమ్మరికుంట్ల యువకెరటం ప్రభుత్వ ఇంజనీర్‌గా ఎంపిక

**తెలంగాణ వాటర్ సప్లై డిపార్ట్‌మెంట్‌లో అసిస్టెంట్ ఇంజనీర్ (ఏఈ)గా తూర్పాటి సాయికిరణ్ నియామకం**

**కుమ్మరికుంట్ల ఎంప్లాయిస్ సొసైటీ ఆధ్వర్యంలో ఘన ఆత్మీయ సన్మానం**

**కష్టపడితే సాధించలేనిది లేదంటూ యువతకు స్ఫూర్తిగా నిలిచిన విజయం**



తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో తొర్రూర్ ప్రతినిధి (సాంబ పస్తం) అక్టోబర్ 19: పట్టుదల, కష్టపడే తత్వముంటే ఏ లక్ష్యమైనా సులభంగా సాధించవచ్చని నిరూపించారు తొర్రూర్ పట్టణానికి చెందిన యువకుడు తూర్పాటి సాయికిరణ్. తెలంగాణ ప్రభుత్వ వాటర్ సప్లై డిపార్ట్‌మెంట్‌లో అసిస్టెంట్ ఇంజనీర్ (ఏఈ) ఉద్యోగాన్ని సాధించి, కన్నవారికి, పుట్టిన గడ్డకు పేరు తెచ్చారు. ఈ నేపథ్యంలో సోమవారం కుమ్మరికుంట్ల గ్రామంలో కుమ్మరికుంట్ల ఎంప్లాయిస్ సొసైటీ ఆధ్వర్యంలో సాయికిరణ్‌కు ఘనంగా ఆత్మీయ సత్కారం నిర్వహించారు. కుమ్మరికుంట్ల గ్రామానికి చెందిన తూర్పాటి సంజీవ - చంద్రమ్మ దంపతుల రెండవ కుమారుడైన తూర్పాటి శివగోపాల్ కుటుంబంతో తొర్రూర్ పట్టణంలో స్థిరపడ్డారు. శివగోపాల్ - వెంకటమ్మ దంపతుల పెద్ద కుమారుడే ఈ సాయికిరణ్. తమ కుటుంబం నుంచి ప్రభుత్వ రంగంలో ఉన్నత ఉద్యోగం సాధించడం పట్ల గ్రామస్థులు, ఎంప్లాయిస్ సొసైటీ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఈ ఆత్మీయ సన్మాన వేదికపై సొసైటీ సభ్యులు సాయికిరణ్‌ను శాలువాలు కప్పి, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు మాట్లాడారు. "పేదరికం, కష్టాలు ఏవీ లక్ష్యానికి అడ్డుకావు. గురి స్పష్టంగా ఉండి, పట్టుదలగా శ్రమిస్తే ప్రభుత్వ ఉద్యోగం సాధించడం అసాధ్యం ఏమీ కాదు అనడానికి సాయికిరణ్ పట్టుదలే నిదర్శనం. మా గ్రామానికి చెందిన యువకుడు ఈ స్థాయికి ఎదగడం మా అందరికీ గర్వకారణం. భవిష్యత్తులో సాయికిరణ్ మరిన్ని శిఖరాలు అధిరోహించి, గ్రామానికి, రాష్ట్రానికి మరింత పేరు ప్రతిష్టలు తేవాలి. తుర్పాటి సాయికిరణ్ మాట్లాడుతూ. నన్ను నమ్మి ఆశీర్వదించిన గ్రామ పెద్దలకు, ఎల్లప్పుడూ వెన్నుదన్నుగా నిలిచిన కుమ్మరికుంట్ల ఎంప్లాయిస్ సొసైటీకి జీవితాంతం రుణపడి ఉంటాను. ఈ విజయం కేవలం నా ఒక్కడిది కాదు, నన్ను కష్టపడి చదివించిన నా తల్లిదండ్రులు నా కుటుంబ సభ్యులు, నన్ను ప్రోత్సహించిన గ్రామస్తులం దరిది. యువత ఎప్పుడూ లక్ష్యాన్ని చిన్నచూపు చూడకుండా, కష్టపడి చదివితే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చు. ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన ప్రముఖులు, ఎంప్లాయిస్ సొసైటీ సభ్యులు, కుటుంబ సభ్యులు మరియు యువకులు పెద్ద సంఖ్య లో పాల్గొని సాయికిరణ్‌ను ఘనంగా అభినందించారు.

# ఖమ్మం పట్టణంశ్రీనివాస్ నగర్‌లో దేవి శరన్నవరాత్రుల 9వ రోజు ఘనంగా వేడుకలు



తొలి అక్షరం/ఖమ్మం జిల్లా ప్రతినిధి అక్టోబర్ 19: ఖమ్మం 27 డివిజన్ శ్రీనివాస్ నగర్ మ శాంతి రైస్ మిల్ సమీపంలో దసరా దేవి నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కనుల పండుగ గా జరుగుతున్నాయి ఈరోజు 9వ రోజు అయిన అమ్మవారు ఆదిపరాశక్తి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు పురాణాల ప్రకారం మహిషాసురుడు అనే రాక్షసుడిని దుర్గాదేవి సంహరించి ధర్మాన్ని కాపాడిన విజయానికి గుర్తుగా నవరాత్రులను జరుపుకుంటారు చెడుపై మంచి అధర్మంపై ధర్మం ప్రతికూల శక్తులపై దైవ శక్తి సాధించిన విజయానికి ఈ పండుగ ప్రతీకగా నిలుస్తుంది నవరాత్రుల కేవలం అమ్మవారి ఆరాధనకే పరిమితం కావు ఉపవాసం ధ్యానం మంత్ర పఠనం సేవ ఆత్మ పరిశీలన వంటి ఆధ్యాత్మిక సాధనల ద్వారా మనసును ప్రశాంతంగా ఉంచుకోవడానికి కూడా ఈ రోజులు ప్రధాన్యతనిస్తాయని భక్తులు విశ్వసిస్తారు అమ్మవారికి ఈరోజు లింగాల రామ్మూర్తి గౌడ్ దంపతులచే ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు ఈ కార్యక్రమంలో మహిళ కమిటీ వారు భవాని మాతలు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# పలు అభివృద్ధి పనులకు మంత్రి పొంగిలేటి శంకుస్థాపన



తొలి అక్షరం/ఖమ్మం జిల్లా ప్రతినిధి అక్టోబర్ 19: సోమవారం ఏదులాపురం మున్సిపాలిటి, టిఎన్జీవో కాలనీ, 22వ వార్డు నందు 2.5 కోట్ల అంచనా వ్యయంతో నూతనంగా నిర్మించే గిరిజన బాలుర పోస్ట్ మెట్రిక్ హాస్టల్ భవన నిర్మాణం పనులకు జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తో కలిసి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శంకుస్థాపన చేశారు.

# నవంబర్ 15లోగా వెలుగుమట్ల కాలనీ నిర్మాణాలు పూర్తి చేయాలి

**- అక్టోబర్ నెలాఖరులోగా ఇళ్ల స్లాబులు పూర్తి చేయాలి: మంత్రి తుమ్మల**





తొలి అక్షరం/ఖమ్మం జిల్లా ప్రతినిధి అక్టోబర్ 19: వెలుగుమట్ల కాలనీలో నిర్మిస్తున్న 300 ఇందిరమ్మ ఇళ్లతోపాటు అన్ని మౌలిక వసతుల పనులను నవంబర్ 15వ తేదీలోగా నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్‌తో కలిసి కాలనీలో నిర్మాణ పనులను పరిశీలించిన అనంతరం మీడియాతో మాట్లాడారు. అక్టోబర్ నెలాఖరులోగా అన్ని ఇళ్ల స్లాబుల నిర్మాణం పూర్తి చేయాలని, నవంబర్ 8వ తేదీలోగా ప్రతి ఇంటిపై సోలార్ రూఫ్‌టాప్ ప్యానెళ్ల ఏర్పాటు పూర్తి చేయాలని సూచించారు. పనుల పురోగతిపై ప్రతి మూడు రోజులకు ఒకసారి నివేదిక సమర్పించాలని, అవసరమైతే అదనపు సిబ్బందిని నియమించి పగలు, రాత్రి పనులు కొనసాగించాలని ఆదేశించారు. **అన్ని మౌలిక వసతులు కల్పించాలి** ఇళ్ల నిర్మాణాలతోపాటు రహదారులు, డ్రైనేజీలు, ఎనిమిది దుకాణాలతో కూడిన షాపింగ్ కాంప్లెక్స్, బస్తీ దవాఖానా, కమ్యూనిటీ హాల్, అంగన్‌వాడీ కేంద్రం తదితర పనులను కూడా గడువులోగా పూర్తి చేయాలన్నారు. ప్రతి ఇంటికి తాగునీటి పైపులైన్, కుళాయి ఏర్పాటు చేయాలని సూచించారు. ఇళ్లన్నీ ఒకే నమూనాలో, ఆకర్షణీయంగా ఉండేలా నిర్మించాలని స్పష్టం చేశారు. **డిసెంబర్ 9న ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభోత్సవం** వెలుగుమట్ల కాలనీని డిసెంబర్ 9న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు మంత్రి తెలిపారు. అప్పటికి ఇళు ,, రహదారులు, డ్రైనేజీలు, ఇతర మౌలిక వసతులన్నీ అందుబాటులోకి రావాలని పేర్కొన్నారు. కాలనీకి అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించి ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలని అధికారులకు సూచించారు. గతంలో భూముల విషయంలో మోసపోయిన పేదలకు శాశ్వత నివాసాలు కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం అర్హులను గుర్తించి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసిందని మంత్రి తెలిపారు. ఇళ్లతోపాటు అవసరమైన సదుపాయాలన్నీ కల్పించి పేదల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఖాదర్ బాబా, ఖమ్మం మార్కెట్ కమిటీ చైర్మన్ హన్మంతరావు, ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# తాగునీటికి ప్రాధాన్యం ఇవ్వాలి

**- నీటిని పొదుపుగా వాడుకోవాలి: మంత్రి తుమ్మల**



తొలి అక్షరం/ఖమ్మం జిల్లా ప్రతినిధి అక్టోబర్ 19: నీటిని పొదుపుగా వినియోగిస్తూ తాగునీటి అవసరాలకు ప్రాధాన్యం ఇవ్వాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. సోమవారం రఘునాథపాలెం మండలంలోని ఈర్లపూడి చెరువును ఆయన పరిశీలించారు. నాగార్జునసాగర్ జలాలను మంచుకొండ ఎత్తిపోతల పథకం ద్వారా విడుదల చేసి ఈర్లపూడి చెరువును నింపినట్లు మంత్రి తెలిపారు. ఎల్‌నినో ప్రభావంతో రానున్న రోజుల్లో ఎండల తీవ్రత పెరిగే అవకాశం ఉండటంతో నీటిని జాగ్రత్తగా వినియోగించాలని ప్రజలు, రైతులకు విజ్ఞప్తి చేశారు. రైతులు తక్కువ నీటితో సాగయ్యే ఆరుతడి పంటలను ఎంచుకోవాలని, వరి, మొక్కజొన్న వంటి అధిక నీటి అవసరమయ్యే పంటల సాగుకు దూరంగా ఉండాలని సూచించారు. నీరు, విద్యుత్ కొరత ఏర్పడకుండా ప్రతి ఒక్కరూ పొదుపు పాటించాలని, ప్రజలతోపాటు పశుపక్ష్యాదుల తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకోవాలని మంత్రి పేర్కొన్నారు. ఈ పర్యటనలో సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ మాజీ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల జీవితాల్లో విజయాల వెలుగులు నిండాలి

**నెల్లికుదురు మండల ప్రజలకు బత్తిని అనిల్‌గౌడ్ విజయదశమి శుభాకాంక్షలు**

**చెడుపై మంచి విజయానికి ప్రతీకగా దసరా పండుగ**



తొలి అక్షరం/నెల్లికుదురు అక్టోబర్ 19: నెల్లికుదురు మండల కేంద్రంలోనిఎర్రబెల్లిగూడెం రామాంజపురం గ్రామానికి చెందిన మాజీ బీఆర్ఎస్ ఉమ్మడి ఎంపీటీసీ, నెల్లికుదురు ఎంపీటీసీ ఫోరం అధ్యక్షుడు బత్తిని అనిల్‌గౌడ్ మండల ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విజయదశమి పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో నూతన వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని, ప్రతి కుటుంబంలో శాంతి, సౌభాగ్యాలు వెల్లివిరియాలని కోరారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా నిలిచే దసరా పండుగను ప్రజలంతా భక్తిశ్రద్ధలతో, సోదరభావంతో జరుపుకోవాలని పిలుపునిచ్చారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రతి ఒక్కరికీ విజయాలు చేకూరాలని ఆయన ఆకాంక్షించారు.

# అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

**- ఆర్థిక ఇబ్బందులున్నా సంక్షేమ పథకాలు ఆగవు: మంత్రి పొంగులేటి**







రాష్ట్రంలో అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. సోమవారం కూసుమంచి క్యాంపు కార్యాలయంలో మండలానికి చెందిన రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కులం, మతం, రాజకీయాలకు అతీతంగా అర్హులైన పేదలందరికీ సొంతింటి కల నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మొదటి విడతలో 4.5 లక్షల ఇళ్లు, రెండో విడతలో 2.5 లక్షల ఇళ్లు మంజూరు చేశామని, హైదరాబాద్‌లోనూ లక్ష ఇళ్లతోపాటు ఇందిరమ్మ టవర్ల నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. ఇప్పటివరకు రాష్ట్రంలో సుమారు 2.30 లక్షల నుంచి 2.40 లక్షల ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని వెల్లడించారు. అవసరమైతే మూడో, నాలుగో విడతల్లోనూ ఇళ్లు మంజూరు చేస్తామని స్పష్టం చేశారు. ప్రజలకు సన్నబియ్యం, రేషన్ కార్డులు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రైతు భరోసా, రుణమాఫీ, రైతు బీమా వంటి పథకాలను అందిస్తున్నామని తెలిపారు. నిరుద్యోగ యువతకు ఇప్పటికే 73 వేల ఉద్యోగాలు కల్పించామని, మరో 14 వేల ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు ఇచ్చామని పేర్కొన్నారు. మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు అందిస్తూ ఆర్థిక భద్రత కల్పిస్తున్నామని చెప్పారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ పేదల సంక్షేమ పథకాల అమలు ఆగదని స్పష్టం చేశారు. అనంతరం రాష్ట్ర ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి, గృహనిర్మాణ శాఖ పీడీ భూక్యా శ్రీనివాస్, ఎంపీడీవో జశ్వంత్ కుమార్, తహశీల్దార్ సైదులు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# రామన్నపేట మండల ప్రజలకు దసరా శుభాకాంక్షలు



**- బండ మధుకర్ రెడ్డి బిజెపి పార్టీ మండల అధ్యక్షులు**

తొలి అక్షరం/రామన్నపేట అక్టోబర్ 19: రామన్నపేట మండల ప్రజలకు కొమ్మాయిగూడెం గ్రామ ప్రజలకు నా ఇంటి ఆడపడుచులకు దసరా శుభాకాంక్షలు

# వెలుగుల వరినమ్ముకున్న విజయపదం: దసరా

తరాల అక్షరాలు తలవంచని మైదానంలో
కాలం గీసిన కవచంపై రాలిన తొలకరి చిరునవ్వు... దసరా!
ఇది కేవలం బతుకమ్మల చప్పుళ్ల చప్పుడు కాదు,
ఇది దిక్కుల తుది వరకు ప్రతిధ్వనించే గెలుపు చైతన్య నాదం.
నవదుర్గల శ్వాసలో నడుస్తున్న మట్టి పరిమళం,
నిప్పు కణికల వెనుక దాగున్న పవిత్రతకు నివాళి!
చీకటి గుండెల్లో చిరుదీపం వెలిగించిన వేళ,
రావణుడి అహంకారం అస్థిపంజరమైన భూమిపై
రాముడి బాణం వేసిన అడుగుల తాలూకు చరిత ఇది.
కానీ, ఇది అంతటితో ఆగిపోదు...
ప్రతి మనిషి లోపలి రాక్షసుడిని హతమార్చే
అంతరంగిక కురుక్షేత్రం!
శమీవృక్షం కొమ్మలపై బంగారమై రాలిన ఆకులు కాదు,
అవి కష్టాల కడలిని దాటిన మనిషి గుండెల్లో
మెరిసిన విజయాల స్వర్ణక్షరాలు.
పాలపిట్ట రెక్కల మీద ప్రయాణించిన ఆశల గాలి,
ఇంటి గుమ్మానికి వేలాడిన బంతిపూల నవ్వుల మాల...
ఇది కాలం రాసుకున్న గెలుపు కావ్యం.
అహంకారపు పొగరును మట్టికరిపించి,
అణచివేతపై ఎగిసిన ధర్మ జెండా.
మట్టి తడి ఆరిపోని ఈ భరత భూమిపై
ప్రతి గడపలోనూ వెలుగుల జలపాతం ఉప్పొంగే వేళ,
ఓ మానవుడా! నీలోని చీకటిని కరిగించు...
ఈ దసరా పండుగ నీ జీవితంలో
అలుపెరగని విజయాల సువర్ణ అధ్యాయం కావాలి



– తాడూరి సంపత్ సీనియర్ జర్నలిస్ట్, తెలుగు వార్త హెచ్‌డీ ఛానల్ సీఈవో

# అంతర్జాతీయ ఎగుమతుల కేంద్రంగా దండు మల్కాపూర్!

● భారత్ - న్యూజిలాండ్ వాణిజ్య ఒప్పందంతో పారిశ్రామికవాడకు కొత్త అవకాశాలు



తొలి అక్షరం/చౌటుప్పల్, అక్టోబర్ 19: యాదాద్రి భువనగిరి జిల్లా దండు మల్కాపూర్ పారిశ్రామికవాడ అంతర్జాతీయ వాణిజ్య రంగంలో మరో ముందడుగు వేసింది. ఇక్కడి టీఐఎఫ్ఎంఎస్ఎంఈ గ్రీన్ ఇండస్ట్రియల్ పార్కు నుంచి న్యూజిలాండ్‌కు వ్యవసాయ, ఆహార ఉత్పత్తుల ఎగుమతుల రవాణా ప్రారంభమైంది. విదేశీ వాణిజ్య శాఖ అదనపు డైరెక్టర్ జనరల్ డాక్టర్ సంపత్ కుమార్ జెండా ఊపి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. భారత్‌న్యూజిలాండ్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంతో తెలంగాణ పరిశ్రమలకు అంతర్జాతీయ మార్కెట్లలో కొత్త అవకాశాలు లభిస్తాయని సంపత్ కుమార్ తెలిపారు. ఈ ఒప్పందం ద్వారా వస్త్రాలు, దుస్తులు, తోలు ఉత్పత్తులు, ఔషధాలు సహా పలు రంగాలకు ఎగుమతుల అవకాశాలు విస్తరించనున్నాయని పేర్కొన్నారు. దండు మల్కాపూర్ నుంచి ఎగుమతులు ప్రారంభం కావడం చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు ప్రయోజనం చేకూర్చడంతోపాటు వ్యాపార విస్తరణ, ఉపాధి కల్పనకు దోహదపడుతుందని పరిశ్రమ వర్గాలు ఆశాభావం వ్యక్తం చేశాయి. ఈ కార్యక్రమంలో విదేశీ వాణిజ్య శాఖ, అపెడా, రాష్ట్ర ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.




# నిరుపేద క్రీడాకారిణికి రూ.50 వేల ఆర్థిక సాయం.. రాజగోపాల్ రెడ్డి ఔదార్యం!

- జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన నియోజితకు అండగా ఎమ్మెల్యే..
క్రీడాకారుల ప్రోత్సాహానికి భరోసా

తొలి అక్షరం/చౌటుప్పల్: అక్టోబర్ 19: నిరుపేద కుటుంబంలో పుట్టి, స్వశక్తితో ఎదుగుతూ జాతీయ స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైన చౌటుప్పల్ మున్సిపాలిటీ 14వ వార్డుకు చెందిన క్రీడాకారిణి నియోజితకు మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అండగా నిలిచారు. ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న ఆమెకు జమ్మూ కాశ్మీర్‌లోని శ్రీనగర్‌లో నిర్వహించనున్న జాతీయ స్థాయి టైక్వాండో పోటీల్లో పాల్గొనేందుకు రూ.50 వేల తక్షణ ఆర్థిక సహాయం అందించి తన ఉదారతను చాటుకున్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించే జాతీయ స్థాయి టైక్వాండో



పోటీలకు నియోజిత ఎంపికైంది. అయితే, నిరుపేద కుటుంబానికి చెందిన ఆమెకు పోటీల్లో పాల్గొనేందుకు అవసరమైన ఖర్చులు భారంగా మారాయి. ఈ విషయాన్ని గుర్తించిన స్థానిక కౌన్సిలర్ ఉడుగు జ్యోతి రమేష్ గౌడ్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. క్రీడాకారిణి భవిష్యత్తుకు ఆర్థిక ఇబ్బందులు అడ్డంకిగా మారకూడదనే ఉద్దేశంతో రూ.50 వేల ఆర్థిక సాయాన్ని తక్షణమే అందించారు. అడిగిన వెంటనే స్పందించి సహాయం చేయడం ద్వారా నిరుపేద కుటుంబాల ప్రతిభావంతులకు తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని చాటుకున్నారు. ఎన్నో కష్టాలను అధిగమిస్తూ జాతీయ స్థాయికి చేరుకున్న నియోజితకు ఈ ఆర్థిక సహాయం ఎంతో తోడ్పాటు నివ్వనుంది. ప్రతిభ ఉన్న క్రీడాకారులను ప్రోత్సహిస్తూ, వారి విజయానికి అవసరమైన సహకారం అందించడం అభినందనీయమని పలువురు పేర్కొంటున్నారు. ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి ఔదార్యం పట్ల క్రీడాకారిణి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. నిరుపేద కుటుంబానికి చెందిన ఒక యువ క్రీడాకారిణి కలలకు అండగా నిలిచిన ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి సహాయం ఆమెకు జాతీయ స్థాయిలో రాణించేందుకు ప్రోత్సాహాన్నివ్వడంతో పాటు మరెందరో యువ క్రీడాకారులకు స్ఫూర్తిగా నిలవనుంది.

# విజయదశమి పూజకు ఇదే శుభసమయం!

**ఉదయం 9.20 నుంచి 10.20 గంటల మధ్య అమ్మవారి పూజకు అనుకూలం**
**మధ్యాహ్నం 1.56 నుంచి 2.44 గంటల వరకు విజయ ముహూర్తం**

తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో సాంబ అక్టోబర్ 19: విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తులు సంప్రదాయబద్ధంగా అమ్మవారిని పూజించి, ఆయుధ పూజ, శమీ పూజ నిర్వహించాలని నిజాంపేట్ ఆలయ పూజారి శ్రీధర్ పంతులు సూచించారు. ఈ సందర్భంగా ఆయన 'తొలి అక్షరం' రిపోర్టర్‌తో మాట్లాడుతూ.. విజయదశమి రోజున ఉదయాన్నే నిద్రలేచి తలస్నానం ఆచరించి, కొత్త వస్త్రాలు ధరించి భక్తిశ్రద్ధలతో అమ్మవారిని పూజించాలని తెలిపారు. ఉదయం 9.20 నుంచి 10.20 గంటల మధ్య పూజలు నిర్వహించి ప్రత్యేక నైవేద్యాలు సమర్పించడం శుభప్రదమని పేర్కొన్నారు. ఈ ఏడాది విజయ ముహూర్తం మధ్యాహ్నం 1.56 నుంచి 2.44 గంటల వరకు ఉందని, ఈ సమయంలో ఆయుధ పూజ, శమీ పూజతో పాటు నూతన పనులను ప్రారంభించుకోవచ్చని వివరించారు. విజయదశమి రోజున జమ్మి చెట్టుకు పూజలు నిర్వహించి, జమ్మి ఆకులను పెద్దలకు, బంధుమిత్రులకు ఇచ్చిపుచ్చుకోవడం మన సంప్రదాయమని తెలిపారు. ఇలా చేయడం వల్ల అదృష్టం, విజయం కలుగుతాయని భక్తులు విశ్వసిస్తారని చెప్పారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా నిలిచే విజయదశమిని ప్రతి ఒక్కరూ భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని శ్రీధర్ పంతులు ఆకాంక్షించారు.



# విజయదశమి పండుగను ఆనందంగా జరుపుకోవాలి

**రావణాసుర వధకు పటిష్టమైన ఏర్పాటు చేయాలి**

తొలి అక్షరం/మహబూబాబాద్ బ్యూరో అక్టోబర్ 19: విజయదశమి దసరా పండుగను ప్రజలు కుటుంబ సమేతంగా ఆనందంగా జరుపుకోవాలని శాసనసభ్యులు వైద్యులు భూక్యా మురళి నాయక్, చైర్పర్సన్ గుగులోత్ జ్యోతి అన్నారు. దసరా ఉత్సవంలో భాగంగా సోమవారం పురపాలక సంఘ పరిధిలోని 31 వ వార్డులో నిర్వహించనున్న రావణాసుర దహన కార్యక్రమ ఏర్పాట్లను ఎమ్మెల్యే మురళి నాయక్, మున్సిపల్ చైర్ పర్సన్ జ్యోతితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్యక్రమం జరిగే ప్రదేశంలో భద్రతా ఏర్పాట్లు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తీసుకోవాల్సిన చర్యలు, పారిశుద్ధ్యం, ట్రాఫిక్ నియంత్రణ తదితర అంశాలపై



సంబంధిత అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రావణాసుర దహన కార్యక్రమాన్ని ప్రజలందరూ సురక్షితంగా, ప్రశాంత వాతావరణంలో వీక్షించేలా అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు. దసరా పండుగను ప్రజలందరూ కుటుంబ సమేతంగా ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని, కార్యక్రమానికి హాజరయ్యే ప్రజల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ అన్ని శాఖల



అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక వార్డు కౌన్సిలర్ పుచ్చకాయల సరిత, బొల్లు రాజు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బెల్లంకొండ శ్రీనివాస్ గౌడ్, పెండ్యాల శ్రీనివాస్,ఐజు ఉపేందర్ , శానిటైజర్ ఇన్స్పెక్టర్, శ్రీహరి, జవాన్ కృష్ణ,సంబంధిత అధికారులు, మున్సిపల్ సిబ్బంది,ప్రజాప్రతినిధులు,స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# గౌడ యువత ఐక్యతే లక్ష్యం.. బీఆర్ఎస్ బలోపేతమే ధ్యేయం!

- టీజీవైఎస్ జిల్లా అధ్యక్షుడు బొంగు మనోజ్ గౌడ్‌కు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి అభినందనలు

తొలి అక్షరం/చౌటుప్పల్: అక్టోబర్ 19: తెలంగాణ గౌడ యువజన సంఘం (టీజీవైఎస్) యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన చౌటుప్పల్ మున్సిపాలిటీకి చెందిన బీఆర్ఎస్ యువ నాయకుడు బొంగు మనోజ్ గౌడ్ మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పూల బొకే అందజేసి దసరా శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన మనోజ్ గౌడ్‌ను ప్రభాకర్ రెడ్డి శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ.. బొంగు మనోజ్ గౌడ్ అనేక సంవత్సరాలుగా బీఆర్ఎస్ పార్టీ కార్యక్రమాలతో పాటు గౌడ సామాజిక వర్గ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ యువతలో ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారని కొనియాడారు. మునుగోడు నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి, గీత కార్మికుల సమస్యల పరిష్కారానికి



ఆయన చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. గౌడ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడిగా మనోజ్ గౌడ్ నియామకం కావడం గౌడ యువతకు మరింత ప్రోత్సాహాన్నిస్తుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా బొంగు మనోజ్ గౌడ్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో జిల్లా అధ్యక్ష బాధ్యతలు అప్పగించిన టీజీవైఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గట్టు నరేష్ గౌడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి ఆశీస్సులు, సహకారంతో తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తానని చెప్పారు. యాదాద్రి భువనగిరి జిల్లాలోని ప్రతి మండలం, ప్రతి గ్రామంలో టీజీవైఎస్ కమిటీలను బలోపేతం చేసి గౌడ యువతను ఐక్యంగా ముందుకు నడిపిస్తానని వెల్లడించారు. చౌటుప్పల్ మున్సిపాలిటీలో బీఆర్ఎస్ పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు గౌడ యువతను పార్టీ వైపు ఆకర్షించేలా కార్యాచరణ రూపొందిస్తానన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గౌడ కులస్తులకు అమలైన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ, గీత కార్మికుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని స్పష్టం చేశారు. గౌడ సామాజిక వర్గ అభ్యున్నతి, యువతకు నాయకత్వ అవకాశాలు కల్పించడం తన ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో మునుగోడు నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు, చౌటుప్పల్ మున్సిపాలిటీ గౌడ సంఘం పెద్దలు, యువజన సంఘం సభ్యులు పాల్గొన్నారు.

# ప్రజా సంక్షేమం కోసమే ప్రభుత్వ కృషి

### గత పాలకుల వైఖరి వల్లే రాష్ట్రంలో ఆర్థిక సంక్షోభం... పార్లమెంట్ సభ్యులు పోరిక బలరాం నాయక్





**తొలి అక్షరం/మహబూబాబాద్ బ్యూరో అక్టోబర్ 19:** ప్రజా సంక్షేమం కోసమే రాష్ట్ర ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తుందని పార్లమెంటు సభ్యులు పోరిక బలరాం నాయక్ తెలిపారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శాసనసభ్యులు వైద్యులు భూక్యా మురళి నాయక్ అధ్వర్యంలో లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ"పేద ప్రజల సంక్షేమమే లక్ష్యంగా, ప్రతి నిరుపేద కుటుంబానికి అండగా నిలవాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పనిచేస్తోంది. అనారోగ్య సమస్యలతో బాధపడుతూ వైద్య చికిత్స కోసం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో ఉపయోగకరంగా నిలుస్తోందని తెలిపారు.వైద్యం కోసం అప్పులు చేసి ఇబ్బందులు పడుతున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక సహాయం అందించడం వారికి ఎంతో ఊరటనిస్తుంది. అర్హులైన ప్రతి బాధిత కుటుంబానికి ప్రభుత్వ పథకాలు, సంక్షేమ ఫలాలు చేరాలనే లక్ష్యంతో మా ప్రభుత్వం కృషి చేస్తోంది. ప్రజల కష్టాలను గుర్తించి, వారి అవసరాలకు అనుగుణంగా సహాయం అందించడం ప్రజా ప్రభుత్వ బాధ్యత.మహబూబాబాద్ పట్టణ అభివృద్ధితో పాటు పట్టణ ప్రజల సంక్షేమం కోసం కలిసి నిరంతరం కృషి చేస్తాం. పట్టణంలోని అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పిస్తూ, వారికి అందాల్సిన ప్రయోజనాలు చేరేలా మా వంతు బాధ్యతగా పనిచేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో పురపాలక సంఘ చైర్పర్సన్ గుగులోత్ జ్యోతి, కాంగ్రెస్ పార్టీ నాయకులు భూక్యా దాల్ సింగ్, స్థానిక కాంగ్రెస్ పార్టీ వార్డు కౌన్సిలర్లు, నీరుటి లక్ష్మీనారాయణ, బొల్లు రాజు, సాల్వాయి దిలీప్, గాడి పెల్లి చరణ్, కాంగ్రెస్ పార్టీ మహబూబాబాద్ మండల అధ్యక్షులు బెల్లంకొండ శ్రీనివాస్ గౌడ్, గూడూరు మండల అధ్యక్షులు, మాజీ మండల అధ్యక్షులు చిట్టి వెంకన్న గౌడ్, జిల్లా నాయకులు ఎడ్ల రమేష్, మాజీ కౌన్సిలర్లు పట్టణ నాయకులు వివిధ మండల నాయకులు కార్యకర్తలు లబ్ధిదారులు మహిళా మణులు పాల్గొన్నారు.

# బిజెపి ఆధ్వర్యంలో కుట్టు మిషన్ల పంపిణీ

### - ప్రతిమహిళ ఒక శక్తిగా మారాలి
### జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు హుస్సేన్ నాయక్





**తొలి అక్షరం/నెల్లికుదురు అక్టోబర్ 19:** నెల్లికుదురు మండలం స్థానిక కేంద్రంలో బిజెపి మండల అధ్యక్షుడు చందు రాజ్ యాదవ్ ఆధ్వర్యంలో కుట్టు మిషన్ల పంపిణీ చేయడం జరిగింది. ముఖ్యఅతిథిగా జాతీయ ఎస్.టి.కమిషన్ సభ్యులు హుస్సేన్ నాయక్ ముఖ్య అతిథిగా పాల్గొని నెల్లికుదురు మండలం ఇనుగుర్తి మండలంలాల కు చెందిన హాల్ హిందూస్తాన్ ఏరోనాటికల్ లిమిటెడ్ వారి సి.ఎస్.ఆర్.యాక్టివిటీ లో భాగంగా మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేయడం జరిగింది.మొత్తం 224 కుట్టు మిషన్లు రావడం జరిగింది. మండలాల్లో ఉన్న బడుగు బలహీన వర్గాలు ప్రతి మహిళకు కుట్టు మిషన్ అందజేయడం జరిగింది. హుస్సేన్ నాయక్ ప్రతి మహిళ దేశం లోని ముందుండాలని, మహిళలు తలుచుకుంటే అసాధ్యమైనది ఏమీలేదని చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో సహుస్సేన్ నాయక్, జిల్లానాయకులు ఎడ్ల అశోక్ రెడ్డి, బిజెపి మండల అధ్యక్షుడు చందు రాజ్ యాదవ్, రత్తిరామ్ తండా, సర్పంచ్ మదన్ లాల్, యాకి రెడ్డి , సుందర్, నెల్లికుదురు మండలం ఇనుగుర్తి మండలం బిజెపి నాయకులు జిల్లా నాయకులు పాల్గొన్నారు.

# పాలపిట్టను బంధించి చూడటం చట్టరీత్యా నేరం!

### - పక్షులకు హాని కలిగిస్తే కఠిన చర్యలు.. అటవీశాఖ అధికారుల హెచ్చరిక




**తొలి అక్షరం /కొణిజర్ల, అక్టోబర్ 19:** దసరా పండుగను పురస్కరించుకొని ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం గుబ్బగుర్తి గ్రామంలో పాలపిట్ట సంరక్షణపై అటవీశాఖ అధికారుల సమక్షంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.దసరా పండుగలో పాలపిట్టకు ఉన్న ప్రత్యేకత, సాంస్కృతిక ప్రాముఖ్యతను అధికారులు ప్రజలకు వివరించారు. పాలపిట్టను చూడాలనే ఆశతో పక్షులను పట్టుకొని బంధించడం, వాటికి హాని కలిగించడం చట్టరీత్యా నేరమని హెచ్చరించారు. వన్యప్రాణుల సంరక్షణ చట్టం కింద నేర తీవ్రతను బట్టి గరిష్టంగా ఏడేళ్ల వరకు జైలు శిక్ష పడే అవకాశం ఉందని తెలిపారు.పాలపిట్టతో పాటు ఇతర పక్షులను వేటాడకుండా, వాటి సహజ ఆవాసాలను కాపాడాలని సూచించారు. పండుగ సంప్రదాయాలను పాటించే క్రమంలో పక్షుల స్వేచ్ఛకు భంగం కలిగించకూడదని, ప్రకృతి పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.పక్షులను పట్టుకోవడం, బంధించడం లేదా వాటికి హాని కలిగించే ఘటనలు ఎక్కడైనా కనిపిస్తే అటవీశాఖకు సమాచారం అందించాలని అధికారులు సూచించారు. ఇందుకోసం అటవీశాఖ టోల్‌ఫ్రీ నంబర్ 1800 455 5364, సంప్రదింపు నంబర్ 9849651305 లకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వవచ్చని తెలిపారు.పాలపిట్ట సంరక్షణ, జీవవైవిధ్య పరిరక్షణపై ప్రజల్లో అవగాహన పెంపొందించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని అధికారులు పేర్కొన్నారు. గుబ్బగుర్తి ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ గుగులోతు ఉపేంద్రయ్య, బీట్ ఆఫీసర్లు సైదా, అయోధ్యమ్మ, జ్యోతి లతోపాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

# ధర్మానికి, ధైర్యానికి, విజయానికి ప్రతీక విజయదశమి: జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్





**తొలి అక్షరం/మహబూబాబాద్ బ్యూరో, అక్టోబర్ 19:** విజయదశమి ధర్మానికి, ధైర్యానికి, విజయానికి ప్రతీకగా నిలుస్తుందని జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్ అన్నారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో విజయదశమి సందర్భంగా ఆయుధ పూజలు, పోలీస్ వాహనాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎస్పీ తన సతీమణి, జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్‌తో కలిసి పూజల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ దుర్గామాత ఆశీస్సులతో జిల్లా ప్రజలు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఆయుధ పూజల అనంతరం పోలీస్ సిబ్బంది ప్రజల ప్రాణ, ఆస్తుల రక్షణతో పాటు శాంతిభద్రతల పరిరక్షణకు మరింత నిబద్ధతతో పనిచేయాలని సూచించారు. పోలీస్ వాహనాలను ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంచి, గస్తీ, నేరాల నియంత్రణ, అత్యవసర సేవల్లో సమర్థవంతంగా వినియోగించాలని అన్నారు.ప్రజల సహకారంతో జిల్లాలో శాంతిభద్ర తలను కాపాడుతూ మెరుగైన సేవలు అందించేందుకు పోలీస్ శాఖ నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ ఎస్డీపీఓ తిరుపతిరావు, పట్టణ ఎస్‌హెచ్‌ఓ రఘుపతిరెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రాణహిత నీటిని మళ్లించేందుకు కాఫర్ డ్యాం నిర్మించాలి

- నవంబర్ నెలాఖరులోగా పనులు చేపట్టాలి.. లేకుంటే ఆందోళన
- తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత



**తొలి అక్షరం/మహాదేవపూర్, అక్టోబర్ 19:** రైతుల పంటలను కాపాడేందుకు కాళేశ్వరం కన్నెపల్లి పంప్‌హౌస్ వద్ద కాఫర్ డ్యాం నిర్మించి ప్రాణహిత జలాలను మళ్లించాలని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సుమారు రూ.25 కోట్లతో నెలన్నర రోజుల్లో డ్యాం నిర్మించవచ్చని తెలిపారు.సోమవారం కన్నెపల్లి పంప్‌హౌస్‌ను సందర్శించిన ఆమె.. నవంబర్ నెలాఖరులోగా నిర్మాణ పనులు చేపట్టాలని కోరారు. ప్రభుత్వం స్పందించకపోతే పంప్‌హౌస్ వద్ద ఆందోళన చేస్తామని హెచ్చరించారు. మేడిగడ్డ సమస్యను సాకుగా చూపి రైతులకు అన్యాయం చేయవద్దన్నారు.రాష్ట్రంలో సాగునీరు, విద్యుత్ కొరతను నివారించేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని, చిన్న కాళేశ్వరం ప్రాజెక్టును కూడా పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. కాఫర్ డ్యాం ప్రతిపాదనపై నిపుణులతో చర్చించామని, సాంకేతిక వివరాలను ప్రభుత్వానికి అందిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి బోడ జనార్దన్‌తో పాటు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# మృతురాలి కుటుంబానికి కాంగ్రెస్ నాయకుల పరామర్శ



**తొలి అక్షరం/నెక్కొండ, అక్టోబర్ 19:** వరంగల్ జిల్లా నెక్కొండ మండలం పెద్ద కొర్పోల్ గ్రామానికి చెందిన దుర్గం రమ అనారోగ్యంతో మృతి చెందగా, గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ప్రభుత్వం నుంచి తగిన సహాయం అందేలా కృషి చేస్తామని నాయకులు పేర్కొన్నారు.పరామర్శించిన వారిలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు మెండే రవీందర్, పడాల రవికుమార్, పడాల రాజ్‌కుమార్, జిల్లా ఎస్సీ సెల్ ప్రచార కార్యదర్శి బిర్రు చందర్, గ్రామ ఉపాధ్యక్షుడు గాజుల రాము, సొసైటీ డైరెక్టర్ మట్టే వెంకటయ్య, వార్డు సభ్యులు బాధావత్ కాంతి, విజయ్‌కుమార్, మాజీ సర్పంచ్ కుమారస్వామి, మాజీ ఎంపీటీసీ జమండ్ల రాములు, యూత్ అధ్యక్షుడు పరుపాటి కొమురన్న తదితరులు ఉన్నారు.

# శకుంతలమ్మకు కాంగ్రెస్ నాయకుల నివాళి





**తొలి అక్షరం/నెక్కొండ, అక్టోబర్ 19:** వరంగల్ జిల్లా నెక్కొండ మండల ఈనాడు పత్రిక విలేకరి దాసరి శ్రీనివాస్, నాగరాజు శ్యామ్‌ల తల్లి శకుంతలమ్మ మృతి చెందగా, ఆమె పార్థివదేహానికి టీపీసీసీ సభ్యులు సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి, నెక్కొండ మార్కెట్ కమిటీ చైర్మన్ రావుల హరీష్‌రెడ్డి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బక్కి అశోక్, రామాలయం కమిటీ చైర్మన్ కొమ్మారెడ్డి సుధాకర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఇదునూరి సాయికృష్ణ, సొసైటీ డైరెక్టర్ కేవీ సుబ్బారెడ్డి, ఓబీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాచకొండ రఘు, మార్కెట్ డైరెక్టర్ రావుల మహిపాల్‌రెడ్డి, మాజీ సొసైటీ చైర్మన్ కొమ్మారెడ్డి రవీందర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు షేక్ షబ్బీర్, మహ్మద్ అన్వర్, రావుల తిరుపతిరెడ్డి, గుంటుపల్లి ప్రభాకర్‌రావు, మెట్టు నర్సింహారెడ్డి, వజ్రాల శేఖర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, ముప్వ వెంకటేశ్‌రెడ్డి, కొల్లి రామచంద్రరెడ్డి, కొమ్మారెడ్డి లక్ష్మారెడ్డి, గంధం సుధాకర్, కుళ్ల సుధాకర్, కూడికల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# దుర్గం రమ కుటుంబానికి రూ.5 వేల ఆర్థిక సాయం

**తొలి అక్షరం/నెక్కొండ, అక్టోబర్ 19:** వరంగల్ జిల్లా నెక్కొండ మండలం పెద్దకొర్పోల్ గ్రామానికి చెందిన దుర్గం రమ అనారోగ్యంతో మృతి చెందగా, ఆమె పార్థివదేహానికి టీపీసీసీ సభ్యులు సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబానికి రూ.5 వేల ఆర్థిక సాయం అందించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఈ కార్యక్రమంలో కిసాన్ మండల అధ్యక్షుడు గై లక్ష్మణ్, గ్రామ పార్టీ అధ్యక్షుడు బాధావత్ బీమన్న, వార్డు సభ్యులు బొడ్డుపల్లి యాదగిరి, పోరండ్ల రామచంద్రు, దయ్యాల వెంకన్న, దయ్యాల ఐలయ్య, కాగు వెంకన్న, బొడ్డుపల్లి రాజేందర్, గై సాంబయ్య, బిర్రు సూరయ్య, బండారి శంకర్, బిర్రు యాదగిరి, నర్సింగజు రవి తదితరులు పాల్గొన్నారు.





## రామన్నపేట మండల ప్రజలకు దసరా శుభాకాంక్షలు

**- ఎజాజ్ అలీఖాన్ వ్యవసాయ అధికారి రామన్నపేట**

**తొలి అక్షరం/రామన్నపేట అక్టోబర్ 19:** రామన్నపేట మండల ప్రజలకు అధికారులకు ప్రజాప్రతినిధులకు నా ఇంటి ఆడపడుచులకు దసరా శుభాకాంక్షలు

## రామన్నపేట మండల ప్రజలకు దసరా శుభాకాంక్షలు

**- డాక్టర్ నాగేశ్వరరావు అసిస్టెంట్ ప్రొఫెసర్ సివిల్ సర్జన్**



**తొలి అక్షరం/రామన్నపేట అక్టోబర్ 18:**రామన్నపేట మండల ప్రజలకు అధికారులకు ప్రజాప్రతినిధులకు నా ఇంటి ఆడపడుచులకు దసరా శుభాకాంక్షలు

## రామన్నపేట మండల ప్రజలకు దసరా శుభాకాంక్షలు

**- గొలుసుల సత్తయ్య యాదవ్ సర్పంచ్ కుంకుడు పాముల**



**తొలి అక్షరం/రామన్నపేట అక్టోబర్ 19:** రామన్నపేట మండల ప్రజలకు కుంకుడు పాముల గ్రామ ప్రజలకు దసరా శుభాకాంక్షలు

## ప్రజలందరికీ విజయదశమి శుభాకాంక్షలు

**- దుబ్బాక యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు గట్టు నరేందర్ మహారాజ్**



**తొలి అక్షరం/రామన్నపేట అక్టోబర్ 19:** చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా నిలిచే విజయదశమి పర్వదినాన్ని ప్రజలందరూ ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని దుబ్బాక యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు గట్టు నరేందర్ మహారాజ్ ఆకాంక్షించారు. దుర్గామాత ఆశీస్సులతో ప్రతి ఒక్కరూ ధైర్యంగా ముందుకు సాగుతూ, చేపట్టిన పనుల్లో విజయం సాధించాలని కోరారు. శమీ వృక్ష పూజ, పాలపిట్ట దర్శనం శుభప్రదమని పేర్కొంటూ, తెలంగాణ రాష్ట్ర ప్రజలందరి జీవితాల్లో సుఖసంతోషాలు, శాంతి, శ్రేయస్సు వెల్లివిరియాలని ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు.

## రామన్నపేట మండల ప్రజలకు దసరా శుభాకాంక్షలు

**- ఆలకుంట్ల రాజు వడ్డెర సంఘం రాష్ట్ర కార్యదర్శి**



**తొలి అక్షరం/రామన్నపేట అక్టోబర్ 19:** రామన్నపేట మండల ప్రజలకు నీర్నంల గ్రామ ప్రజలకు దసరా శుభాకాంక్షలు

# షాద్‌నగర్‌లో పారిశుద్ధ్య కార్మికులకు దసరా కానుకగా నూతన వస్త్రాలు

- కార్మికుల సంక్షేమమే లక్ష్యం.. దసరా కానుకగా దుస్తుల పంపిణీ
- కేకే కృష్ణ సహకారంతో పారిశుద్ధ్య కార్మికులకు పండుగ కానుకలు



**తొలి అక్షరం/షాద్ నగర్, అక్టోబర్ 19:** విజయదశమి దసరా పండుగను పురస్కరించుకొని షాద్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. ప్రముఖ కాంట్రాక్టర్ కేకే కృష్ణ సహకారంతో మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్ కార్మికులకు దుస్తులు అందజేసి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో పారిశుద్ధ్య కార్మికుల సేవలు ఎంతో కీలకమని అన్నారు. ఎండ, వానలను లెక్కచేయకుండా ప్రజల ఆరోగ్యం కోసం శ్రమించే కార్మికులను గౌరవించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతని పేర్కొన్నారు. కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వాలని, పండుగ వేళ వారి కుటుంబాల్లో ఆనందం నింపాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. దుస్తుల పంపిణీకి సహకరించిన కేకే కృష్ణను అభినందించారు. కార్యక్రమంలో కృష్ణ రెడ్డి, కౌన్సిలర్ సి. పెంటయ్య, మురళీమోహన్, బచ్చలి నరేష్, రాజు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# కేశంపేటలో హైమాస్ట్ వెలుగుల జిగేల్.. దసరా కానుకగా 19 లైట్లు ప్రారంభం

**- ఐదు గ్రామాల్లో విద్యుత్ వెలుగులు.. హైమాస్ట్ లైట్లను ప్రారంభించిన ఎమ్మెల్యే శంకర్**





**తొలి అక్షరం/షాద్ నగర్, అక్టోబర్ 19:** కేశంపేట: దసరా పండుగను పురస్కరించుకుని కేశంపేట మండలంలోని ఐదు గ్రామాల్లో ఏర్పాటు చేసిన 19 హైమాస్ట్ లైట్లను షాద్‌నగర్ ఎమ్మెల్యే, ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ చైర్మన్ వీర్లపల్లి శంకర్ ప్రారంభించారు. దీంతో గ్రామాల్లోని ప్రధాన కూడళ్లు విద్యుత్ కాంతులతో వెలిగిపోతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. మిగిలిన గ్రామాల్లోనూ త్వరలో హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రమేష్, పీఏసీఎస్ చైర్మన్ శ్రీధర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ సులోచన కృష్ణారెడ్డి, వైస్ చైర్మన్ బాబర్ ఖాన్, కొందుర్గు మండల అధ్యక్షుడు పురుషోత్తంరెడ్డి, ఫరూఖ్‌నగర్ మండల అధ్యక్షుడు రాయికల్ శ్రీనివాస్, మాజీ జడ్పీటీసీ విశాల శ్రవణ్‌రెడ్డి, మాజీ మండల అధ్యక్షుడు వీరేష్, సర్పంచులు ఆనంద్, భాస్కర్, శశికళ యాదయ్య, సంతోష శ్రీశైలం, నాయకులు చెంది తిరుపతిరెడ్డి, జితేందర్‌రెడ్డి, ఇబ్రహీం, గణేష్ నాయక్, హన్మంతు, నరసింహ, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.



## రామన్నపేట మండల ప్రజలకు దసరా శుభాకాంక్షలు

**- గర్దాస్ విక్రమ్ సర్పంచ్ ఇంద్రపాలనగరం**

**తొలి అక్షరం/రామన్నపేట అక్టోబర్ 19:** రామన్నపేట మండల ప్రజలకు ఇంద్రపాలనగరం గ్రామ ప్రజలకు దసరా శుభాకాంక్షలు

# వనంపల్లిలో ఘనంగా స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

- లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డుల అందజేత
- వనంపల్లిలో రేషన్ కార్డుల పండుగ



**తొలి అక్షరం/షాద్ నగర్, అక్టోబర్ 19:** జిల్లేడు చౌదరిగూడ మండలంలోని వనంపల్లి గ్రామంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ భాస్కర్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎన్. చంద్రశేఖర్, గ్రామ సర్పంచ్ అరుణ యాదయ్య లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ప్రభుత్వం అందిస్తున్న రేషన్ కార్డులను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని నాయకులు సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రాజు, గోపాలరెడ్డి, యాదయ్య, నర్సింలు, మల్లేష్, మహిళా కాంగ్రెస్ నాయకురాలు రజిత, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం డైరెక్టర్ వెంకట నరసింహరెడ్డి, ఆంజనేయులు పాల్గొన్నారు. అలాగే సర్పంచులు బోయ రామచంద్రయ్య, బంధయ్య, నిలయ్యతో పాటు గ్రామస్తులు, మండల నాయకులు హాజరయ్యారు. స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీతో అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ రేషన్ సేవలు పొందడంలో మరింత సౌలభ్యం కలుగుతుందని స్థానికులు తెలిపారు.

# డిజిపి కార్యాలయంలో వైభవంగా ఆయుధపూజ





**తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి.సైదులు),అక్టోబర్19:** తెలంగాణ రాష్ట్ర పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లోని డిజిపి కార్యాలయంలో విజయదశమి, దుర్గాష్టమి సందర్భాన్ని పురస్కరించుకుని ఆయుధపూజ, దుర్గాపూజ కార్యక్రమాలను సోమవారం వేడుకగా నిర్వహించారు. డిజిపి సి.వి. ఆనంద్ పూజా కార్యక్రమాల్లో పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. శాంతిభద్రతల పరిరక్షణలో కీలకపాత్ర పోషించే ఆయుధాలకు, వాహనాలకు ఈ సందర్భంగా శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిజి మహేష్ భగవత్, ఏఐజి (అడ్మిన్) రమణ కుమార్, స్టోర్స్ డిఎస్పి, సిఎస్‌ఓతో పాటు పలువురు ఉన్నతాధికారులు, సీనియర్ పోలీస్ అధికారులు, కార్యాలయ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సిరిపురంలో నాగదేవతలకు రేకుల షెడ్డు ప్రారంభం



**రామన్నపేట, అక్టోబర్ 18 (తొలి అక్షరం):**రామన్నపేట మండలం సిరిపురం గ్రామంలోని శ్రీ పార్వతీ పరమేశ్వర స్వామి దేవస్థానం ప్రాంగణంలో నాగదేవతలకు గ్రామ దాతల సహకారంతో ఏర్పాటు చేసిన రేకుల షెడ్డును ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా శివాలయంలో గణపతి పూజ, నవగ్రహ పూజ, నాగదేవతలకు అభిషేకాలు, వేద పండితులచే సంప్రోక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అంబటి ఉపేంద్ర రవీందర్ రెడ్డి, పార్వతీ పరమేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ రాపోలు రమేష్, చేనేత సహకార సంఘం అధ్యక్షులు రాపోలు షణ్ముఖం, సీతారామచంద్రస్వామి దేవస్థానం చైర్మన్ అప్పం రామేశ్వరం, మాజీ సర్పంచ్లు రాపోలు నిర్మలా నరసింహ, అప్పం లక్ష్మీ నరసు, మాజీ ఎంపీటీసీ బడుగు రమేష్, ఉప సర్పంచ్ పున్న వెంకటేశం, వార్డు సభ్యులు, ఆలయ ధర్మకర్తలు, పురోహితులు తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే వేముల వీరేశంకి దసరా శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ నాయకులు



**నకిరేకల్, అక్టోబర్ 18 (తొలి అక్షరం):** నకిరేకల్ శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ వేముల వీరేశం ని పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు ఎండి. జమీరుద్దీన్, మాజీ ఎంపీటీసీ వనం చంద్రశేఖర్, జిల్లా కాంగ్రెస్ సీనియర్ నాయకులు బొడ్డు సురేందర్రావు తదితరులు మర్యాదపూర్వకంగా కలిసి దసరా పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేముల వీరేశం మాట్లాడుతూ, నకిరేకల్ పట్టణ, మండల ప్రజలందరూ సుఖ సంతోషాలతో, సుఖశాంతులతో దసరా వేడుకలను జరుపుకోవాలని ఆకాంక్షించారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక అయిన దసరా పండుగ ప్రతి ఒక్కరి జీవితంలో వెలుగులు నింపాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నకిరేకల్ వెంకటేశ్వర కాలనీలో ఘనంగా చండీ యాగం





**తొలి అక్షరం/రామన్నపేట అక్టోబర్ 18 :**నకిరేకల్ నియోజకవర్గ కేంద్రంలోని వెంకటేశ్వర కాలనీలో ఏర్పాటు చేసిన శ్రీశ్రీ కనకదుర్గమ్మ తల్లి దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం చండీ యాగం ఘనంగా నిర్వహించారు. ఈ చండీ యాగంలో తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి దైద రవీందర్ పాల్గొని, కనకదుర్గమ్మ తల్లిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. నియోజకవర్గ ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని అమ్మవారిని కోరారు. ఈ కార్యక్రమంలో అబ్బగోని రమేష్, గుణగంటి వెంకన్న, గౌడ్ వెంకన్న, జి. సైదులు, జనార్ధన్, కోట అశోక్, భూపతి శ్రవణ్, కొండ రాకేష్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

## రామన్నపేట మండల ప్రజలకు దసరా శుభాకాంక్షలు

**- కంభంపాటి శ్రీనివాసులు గౌడ్ సర్పంచ్ పల్లివాడ**



**తొలి అక్షరం/రామన్నపేట ఆగస్టు 27:**రామన్నపేట మండల ప్రజలకు పల్లివాడ గ్రామ ప్రజలకు. నా ఇంటి ఆడపడుచులకుదసరా శుభాకాంక్షలు. ఇట్లు. కంభంపాటి శ్రీనివాసులు గౌడ్‌సర్పంచ్ పల్లి వాడ



# రామన్నపేట మండల ప్రజలకు దసరా శుభాకాంక్షలు

**- కప్పల రవికుమార్ గౌడ్ (పరిటాల)**

తొలి అక్షరం/రామన్నపేట అక్టోబర్ 19:రామన్నపేట మండల ప్రజలకు కొమ్మాయిగూడెం గ్రామ ప్రజలకు దసరా శుభాకాంక్షలు

# అమ్మవారి ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలి

**- ఉమ్మడి మండలాల మాజీ ఎంపీపీ శివశంకర్ గౌడ్**



తొలి అక్షరం/షాద్ నగర్, అక్టోబర్ 19: దసరా పర్వదినాన్ని పురస్కరించుకుని అప్పారెడ్డిగూడ గ్రామంలోని దుర్గామాత మండపంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి మండలాల మాజీ ఎంపీపీ శివశంకర్ గౌడ్ పాల్గొని దుర్గామాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అమ్మవారి ఆశీస్సులతో గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. గ్రామంలో శాంతి, సౌభాగ్యాలు వెల్లివిరియాలని, ప్రతి కుటుంబం ఆనందంగా ఉండాలని దుర్గామాతను ప్రార్థించినట్లు తెలిపారు. దసరా పండుగ చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక అని పేర్కొంటూ, ప్రజలందరూ పండుగను భక్తిశ్రద్ధలతో, ఐకమత్యంతో, ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని కోరారు. అమ్మవారి కృపతో ప్రజల జీవితాల్లో సుఖశాంతులు నెలకొనాలని ఆకాంక్షించారు.

# అప్పారెడ్డి గూడ భక్తిశ్రద్ధలతో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు

- **హాజరై ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి దంపతులు**
- **అన్నదాన కార్యక్రమాని ప్రారంభించిన ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి**



తొలి అక్షరం/షాద్ నగర్, అక్టోబర్ 19: దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు అప్ప రెడ్డి గూడ లో భక్తిశ్రద్ధలతో వైభవంగా కొనసాగు తున్నాయి.నందిగామ మండలంలోని అప్పారెడ్డి గూడ గ్రామంలో ఏర్పాటు చేసిన అమ్మవారి మండపాన్ని ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి దంపతులు సందర్శించి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా వేద పండితుల ఆశీర్వాదం పొందారు.అమ్మవారి ఆశీస్సులు పొందిన అనంతరం భక్తులతో కలిసి అన్నప్రసాదం స్వీకరించారు.దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రజల్లో భక్తిభావాన్ని,ఆధ్యాత్మిక చింతనను పెంపొందిస్తున్నాయని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో చేగుర్ మాజీ పిఎసిఎస్ చైర్మన్ మామిళ విఠల్,వీర్లపల్లి సర్పంచ్ సిందం పాండు, అప్పారెడ్డిగూడెం మాజీ సర్పంచ్ జెకే నర్సింహులు,వీర్లపల్లి మాజీ సర్పంచ్ సుధాకర్ గౌడ్,వీర్లపల్లి ఉప సర్పంచ్ నాగయ్య,అప్పారెడ్డి కంటెస్టెడ్ సర్పంచ్ కృష్ణ,గ్రామ కమిటీ అధ్యక్షులు దివిటి నరసింహ,వార్డు మెంబర్లు బీఆర్ఎస్ నాయకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# జలవనరులు సమృద్ధిగా ఉండాలి.. షాద్‌నగర్ ప్రజలకు నీటి కష్టాలు రాకూడదు

**బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రవీందర్ యాదవ్**

**ఆర్టీసీ కాలనీ హనుమాన్ దేవాలయ దుర్గామాత మండపంలో**

**రవీందర్ యాదవ్ ప్రత్యేక పూజలు**



తొలి అక్షరం/షాద్ నగర్, అక్టోబర్ 19: షాద్‌నగర్ పట్టణంలోని ఆర్టీసీ కాలనీ హనుమాన్ దేవాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన దుర్గామాత మండపాన్ని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రవీందర్ యాదవ్ సందర్శించి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆశీస్సులు పొందారు. రాబోయే రోజుల్లో షాద్‌నగర్ నియోజకవర్గంలో ప్రజలకు నీటి ఇబ్బందులు ఎదురుకాకుండా, జలవనరులు సమృద్ధిగా ఉండి ప్రతి ఒక్కరూ సుఖసంతోషాలతో జీవించాలని దుర్గామాతను ప్రార్థించారు. సకాలంలో వర్షాలు కురిసి చెరువులు, కుంటలు నీటితో కళకళలాడాలని, పాడిపంటలు సమృద్ధిగా పండి రైతులు సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు శారద శేఖర్, వసంత శ్రీనివాస్, సర్పంచ్ గీత వీరేశం, మాజీ కౌన్సిలర్లు వెంకట్రాం రెడ్డి, నంద కిషోర్, జూపల్లి శంకర్, బీఆర్ఎస్ వార్డు అధ్యక్షులు మల్చలం భిక్షపతి, నాయకులు రవి యాదవ్, నందిగామ శ్రీనివాస్, భువనేశ్వర్ రెడ్డి, అంబటి శేఖర్, రామరాజు, అరుణ్, రమేష్, రాజు, విష్ణువర్ధన్, భాస్కర్, సుషీల్ తదితరులు, భక్తులు, కానీవాసులు పాల్గొన్నారు.

# షాద్‌నగర్‌లో దుర్గాదేవి మండపాల్లో ఎంపీ డీకే అరుణ ప్రత్యేక పూజలు

**ఏలికట్ట అంబా భవానీ మాతను దర్శించుకున్న ఎంపీ**

**పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికిన ఆలయ కమిటీ సభ్యులు**



తొలి అక్షరం/షాద్‌నగర్, అక్టోబర్ 19: నవరాత్రుల సందర్భంగా షాద్‌నగర్ నియోజకవర్గంలోని పలు దుర్గాదేవి మండపాల్లో మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోతూరులో ఏర్పాటు చేసిన దుర్గాదేవి మండపంతో పాటు షాద్‌నగర్ పట్టణంలోని పదో వార్డులో జరిగిన పూజా కార్యక్రమాల్లో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం ఏలికట్టలోని ప్రసిద్ధ అంబా భవానీ మాత ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఎంపీ డీకే అరుణకు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అమ్మవారి కృపతో ప్రజలందరూ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని, తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా అభివృద్ధి చెందాలని ఆమె ఆకాంక్షించారు. దేవీ నవరాత్రులు భక్తి, ఆధ్యాత్మికతకు ప్రతీకలని, అమ్మవారి ఆశీస్సులతో సమాజంలో శాంతి, సౌభాగ్యాలు వెల్లివిరియాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమాల్లో నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి, అందె బాబయ్య, పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి, అశోక్ గౌడ్, అమడాపురం నరసింహ, సదానంద్ గౌడ్, వంశీకృష్ణ, చెంది మహేందర్ రెడ్డి, మనోహర్ రెడ్డి, నాగరాజు చారి, రణధీర్, మటం రిషేక్, శ్రీనివాస చారి, మహేందర్ రెడ్డి, బాల్‌రెడ్డి, పసుల నరసింహ, మంగలి రమేష్, మహేష్, శివలింగం, గణేష్, అంబటి శ్రీశైలం, అభిలాష్ తదితరులు పాల్గొన్నారు. అమ్మవారి ఉత్సవ సమితి సభ్యులు కూడా హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

# సంప్రదాయాలకు ప్రతీకగా దేవీ నవరాత్రులు..

**బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రవీందర్ యాదవ్**

**భక్తి పారవశ్యంలో లింగారెడ్డిగూడ దుర్గామాత మండపం.. ప్రత్యేక పూజల్లో పాల్గొన్న రవీందర్ యాదవ్**





తొలి అక్షరం/షాద్ నగర్, అక్టోబర్ 19: ఫరూఖ్‌నగర్ మండలం లింగారెడ్డిగూడ గ్రామంలో దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలు భక్తుల కోలాహలం మధ్య కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రవీందర్ యాదవ్ గ్రామంలోని దుర్గామాత మండపాన్ని సందర్శించి అమ్మవారికి ప్రత్యేక పూజలు సమర్పించారు. వేదమంత్రాలు, భక్తుల జయజయధ్వానాల మధ్య ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది. ఈ సందర్భంగా గ్రామ ప్రజల జీవితాల్లో సంతోషం, శాంతి వెల్లివిరియాలని, రైతులకు ప్రకృతి అనుకూలించి పంటలు సమృద్ధిగా పండాలని అమ్మవారిని ప్రార్థించారు. పండుగలు, పూజా కార్యక్రమాలు ప్రజల మధ్య ఐక్యతను పెంపొందించడంతో పాటు మన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షులు లక్ష్మణ్ నాయక్, స్థానిక మాజీ సర్పంచ్, ఎంపీటీసీ బిశ్వ మాధవి రామకృష్ణ, సర్పంచ్ గీత వీరేశం, కౌన్సిలర్లు శారద శేఖర్, వసంత శ్రీనివాస్, మాజీ సర్పంచ్ నర్సింలు గౌడ్, మాజీ కౌన్సిలర్ జూపల్లి శంకర్, నాయకులు రవి యాదవ్, నందిగామ శ్రీనివాస్, మల్లేష్ యాదవ్, గోద లక్ష్మయ్య యాదవ్, బుచ్చి రెడ్డి, లింగారెడ్డి, శ్యామ్ సుందర్ రెడ్డి, శశాంక్ గౌడ్, గణేష్, యాదయ్య, విఠలయ్య, షాబాద్ మల్లేష్, ప్రతాప్ రెడ్డి, చందు, రవి, మహేష్, బలరాం, లక్ష్మయ్య, అంజయ్య, జగన్, నాగేష్, నర్సింలు తదితరులు, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

# లింగం ధన్‌లో అంగరంగ వైభవంగా సద్దుల బతుకమ్మ

**రాజమోని కుటుంబం ఏర్పాటు చేసిన భారీ బతుకమ్మ ప్రత్యేక ఆకర్షణ**

**సంప్రదాయబద్ధంగా బతుకమ్మకు వీడ్కోలు పలికిన మహిళలు: సర్పంచ్ నాగిళ్ల వెంకట్**



తొలి అక్షరం/షాద్‌నగర్, అక్టోబర్ 19: రంగురంగుల పూలతో అలంకరించిన బతుకమ్మలు, మహిళల ఆటపాటలు, సంప్రదాయ పాటల నడుమ లింగం ధన్ గ్రామంలో సద్దుల బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. గ్రామ మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని బతుకమ్మలను అందంగా పేర్చి, వాటి చుట్టూ పాటలు పాడుతూ ఉత్సాహంగా సంబరాలు జరుపుకున్నారు.ఈ వేడుకల్లో రాజమోని కుటుంబం ఏర్పాటు చేసిన భారీ బతుకమ్మ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. రంగురంగుల పూలతో అందంగా అలంకరించిన ఈ బతుకమ్మను చూసి గ్రామస్థులు అభినందించారు.ఈ సందర్భంగా సర్పంచ్ నాగిళ్ల వెంకట్ మాట్లాడుతూ బతుకమ్మ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు, ఆడపడుచుల ఆత్మగౌరవానికి ప్రతీక అని అన్నారు. ఇలాంటి పండుగలు ప్రజల్లో ఐక్యతను పెంపొందిస్తాయని, భావితరాలకు సంప్రదాయాల విశిష్టతను తెలియజేయాలని కోరారు. వేడుకల అనంతరం మహిళలు బతుకమ్మకు ఘనంగా వీడ్కోలు పలికారు.ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ గుబ్బ సుదర్శన్ గుప్తా, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు తిరుపతిరెడ్డి, సింగిల్ విండో మాజీ డైరెక్టర్ మధుసూదన్ గౌడ్, తెలంగాణ ఉద్యమకారుడు భాస్కర్, వార్డు సభ్యుడు నాగిళ్ల కృష్ణయ్య, జంగయ్య, గ్రామ పెద్దలు, మహిళలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# ప్రజల జీవితాల్లో సుఖసంతోషాలు వెల్లివిరియాలి

- **ధర్మ విజయానికి ప్రతీక విజయదశమి సర్పంచ్ జెట్ట లావణ్య రమేష్**
- **మోత్కూల గూడ అభివృద్ధే లక్ష్యం.. ప్రజలందరికీ దసరా శుభాకాంక్షలు**



తొలి అక్షరం/షాద్ నగర్, అక్టోబర్ 19: విజయదశమి పర్వదినాన్ని ప్రజలంతా ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని మోత్కూల గూడ సర్పంచ్ జెట్ట లావణ్య రమేష్ ఆకాంక్షించారు. దసరా పండుగను పురస్కరించుకుని గ్రామ ప్రజలకు ఆమె శుభాకాంక్షలు తెలిపారు. చెడుపై మంచి, అధర్మంపై ధర్మం సాధించిన విజయానికి విజయదశమి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ పండుగ ప్రతి ఒక్కరిలో ధైర్యం, ఆత్మవిశ్వాసం నింపుతుందని అన్నారు. ప్రజలంతా ప్రేమాభిమానాలు, సోదరభావంతో మెలుగుతూ గ్రామ అభివృద్ధికి సహకరించాలని పిలుపునిచ్చారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రతి కుటుంబం ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని, రైతులు, కార్మికులు, వ్యాపారులు, ఉద్యోగులు సహా అన్ని వర్గాల ప్రజలకు మేలు జరగాలని ఆకాంక్షించారు. మోత్కూల గూడ గ్రామం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని కోరుకుంటూ గ్రామపంచాయతీ తరఫున ప్రజలందరికీ విజయదశమి శుభాకాంక్షలు తెలియజేశారు.
















## ఎంపీడీవో నాగేంద్ర పరామర్శించిన బిసి రాజారెడ్డి

**తొలి అక్షరం/బనగానపల్లె, అక్టోబర్, 19:** ఆత్మకూరు ఎంపీడీవో నాగేంద్రను బనగానపల్లె పట్టణ మాజీ సర్పంచ్ , అరుణ భారతి సాంస్కృతి సంస్థ అధ్యక్షులు బిసి రాజారెడ్డి పరామర్శించారు. నాగేంద్ర గారు ఇటీవల కర్నూల్ లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో శస్త్ర చికిత్స చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న బిసి రాజారెడ్డి నంద్యాల మండలం కానాల గ్రామానికి వెళ్లి నాగేంద్ర ను పరామర్శించి ఆరోగ్య విషయాలు అడిగి తెలుసుకున్నారు.




## థగ్స్ ఫర్ జస్టిస్ ఆధ్వర్యంలో మార్మోగిన బతుకమ్మ సంబరాలు

**తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి.సైదులు),అక్టోబర్19:** తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీకైన బతుకమ్మ వేడుకలను మల్లాపూర్‌లో థగ్స్ ఫర్ జస్టిస్ బృందం అత్యంత వైభవంగా,పండుగ వాతావరణంలో నిర్వహించింది.ఏ.అరుణ్ యాదవ్ పర్యవేక్షణలో జరిగిన ఈ వేడుకలు స్థానికులను విశేషంగా ఆకట్టుకున్నాయి. రంగురంగుల పూలతో పేర్చిన బతుకమ్మల చుట్టూ మహిళలు,యువతులు జానపద పాటలకు అనుగుణంగా కోలాటాలు ఆడుతూ, లయబద్ధంగా అడుగులేస్తూ ఉత్సాహంగా పాల్గొన్నారు.తెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని, ఐక్యతను చాటిచెప్పేలా ఈ కార్యక్రమం ఘనంగా సాగింది.ఈ సంబరాలలో సంస్థ ప్రతినిధులు, ప్రముఖులు మున్నా గౌడ్, అఫ్రోజ్, శ్రీనివాస్, సాబెర్, కిశోర్ యాదవ్లతో పాటు పలువురు టీమ్ సభ్యులు పాల్గొని వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ సందర్భంగా అరుణ్ యాదవ్ మాట్లాడుతూ... సమాజ సేవతో పాటు మన సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడుకోవడం, ప్రజలందరినీ ఒకే వేదికపైకి తీసుకురావడమే తమ టీమ్ ముఖ్య ఉద్దేశమని స్పష్టం చేశారు.స్థానిక ప్రజల భాగస్వామ్యం, టీమ్ సభ్యుల శ్రమతో ఈ వేడుకలు అత్యంత ఘనంగా విజయవంతమయ్యాయని తెలిపారు.






Editor pastham Saidulu,R.R. GRAPHICS, H.No. 1-8-747/11/45, Street No. 27, Near Sundaraiah Park, Nallakunta, Hyderabad